తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
21 సెప్టెంబరు, 2025



# అఖిలాండ నాయకుని
# ఆనంద ఉత్సవం



# ‘తెలుసు కదా’ అక్టోబరులో విడుదల

**యంగ్ హీరో** సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ‘తెలుసు కదా’. ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో నటిస్తున్న హీరోయిన్ రాశి ఖన్నా తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను తాజాగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా సినిమాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ “కెమెరాలు ఆగిపోయిన తర్వాత కూడా కొన్ని కథలు గుర్తుండిపోతాయి.. ‘తెలుసు కదా’ అలాంటి కథే. ఈ సినిమా ప్రయాణం నాకు ఎంతో ప్రత్యేకం. ఈ జర్నీలో నాతో ఉన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మేం సృష్టించిన ఈ ప్రపంచంలోకి మీరు అడుగు పెట్టే రోజు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను” అని రాశి ఖన్నా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆమె పోస్ట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది.

ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయం అవుతుండటం విశేషం. సిద్ధు సరసన రాశి ఖన్నాతో పాటు శ్రీనిధి శెట్టి కూడా మరో కథానాయికగా నటిస్తున్నారు. రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు.

ఇప్పటికే దాదాపు షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి. భావోద్వేగాలకు పెద్ద పీట వేస్తూ రూపొందుతున్న ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

**తారాతీరం**

**దర్శకుడు** అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న ‘మన శంకర వరప్రసాద్‌గారు’ చిత్రం విడుదల కాకముందే సంచలనాలు సృష్టిస్తోంది.

# కీలక పాత్రలో వెంకటేశ్

ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమాను షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

ఈ చిత్రంలో విక్టరీ వెంకటేశ్ ఒక కీలక పాత్రలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు తారస్థాయికి చేరాయి. చిరంజీవి, వెంకటేశ్ కలిసి తెరపై కనిపించనుండటం, దానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనుండటంతో సినిమాకు అన్ని వైపుల నుంచి భారీ ఆఫర్లు వస్తున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఓటీటీ డీల్ మాత్రమే కాకుండా, శాటిలైట్, ఆడియో, థియేట్రికల్ హక్కులకు కూడా పెద్ద ఎత్తున పోటీ నెలకొన్నట్లు సమాచారం.

చిత్ర యూనిట్ ఈ సినిమా షూటింగ్‌ను నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా ముగించి, 2026 సంక్రాంతికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మెగా స్టార్ కెరీర్‌లో మరో బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్న ఈ సినిమా, రాబోయే రోజుల్లో మరిన్ని అప్‌డేట్‌తో సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోంది.



ఆదివారం వార్త

21 సెప్టెంబరు, 2025

## మంచి ముత్యాలు

- లోపాలను బట్టి మానవుణ్ణి నిర్ణయించవద్దు. - స్వామి వివేకానంద
- గొప్పవారిలోని లోపాలు మూర్ఖులకు ఓదార్పు. - ఐజాక్ డిజ్రాయిలి
- పీపా పెద్దదయినా చిన్న రంధ్రం ఉంటే అంతా వృధాయే.- బేకర్ ఎడ్డి

## కదంబం


'సంఘీ'భావం....5

జీఎస్‌టి సంస్కరణలతో సామాన్యులకు మేలు

కవర్ స్టోరీ..6

అఖిలాండ నాయకుని ఆనంద ఉత్సవం

ఈ వారం కవిత్వం...12

అచంచల యాత్ర

కథ..20

కొత్త చిగురు

సాహిత్యం.. 23

సెల్‌ఫోన్‌తో సమానంగా పుస్తకాన్ని ప్రేమించాలి

కొత్త ధోరణులతో ప్రపంచ పర్యాటక రంగం... 28

ఇంకా...

మొగ్గ

వారఫలం

వంటలు

వగైరా.. వగైరా..


# సమాచారం

## యేడాదిలో పదిహేను రోజులే!

మన దేశంలో వేల సంఖ్యలో రైల్వే స్టేషన్లు ప్రతిరోజూ ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. కానీ, బీహార్‌లో ఓ రైల్వే స్టేషన్ గురించి ఇందుకు పూర్తి విభిన్నంగా చెప్పుకోవచ్చు. అది సంవత్సరంలో కేవలం 15 రోజులు మాత్రమే పని చేస్తుంది. మిగతా రోజులన్నీ మూసి ఉంటుంది. పితృ పక్షం సందర్భంగా పితృదేవతలకు పిండ ప్రదానం చేసే వారి సౌకర్యార్థం భారతీయ రైల్వే ఈ ప్రత్యేక స్టేషన్‌ను తాత్కాలికంగా నిర్వహిస్తోంది. ఇది బీహార్‌లోని ఔరంగాబాద్ జిల్లాలో ఉన్న అనుగ్రహ నారాయణ్ రోడ్ ఘాట్ స్టేషన్ ఇదే. ప్రతి యేటా పితృ పక్షం రోజుల్లో మాత్రమే ఈ స్టేషన్‌ను తెరుస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్ 8న పితృ పక్షం ప్రారంభం కావడంతో ఈ స్టేషన్ కార్యకలాపాలు మొదలయ్యాయి. స్టేషన్ సమీపంలో ప్రవహించే పున్‌పున్ నది తీరంలో ప్రజలు తమ పితృదేవతలకు పిండ ప్రదానాలు, తర్పణాలు సమర్పిస్తారు. గంగా నది కంటే పురాతనమైనదిగా భావించే ఈ నదిని 'ఆదిగంగ పున్‌పున్' అని కూడా పిలుస్తారు.


ఈ పదిహేను రోజులు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు ఇక్కడికి తరలివస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈస్ట్ సెంట్రల్ రైల్వే ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సెప్టెంబరు 21 వరకు సుమారు 8 జతల ప్యాసింజర్ రైళ్లు ఈ స్టేషన్‌లో ఆగుతాయని సమాచారం.

ఈ స్టేషన్‌కున్న మరో ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడ టికెట్ కౌంటర్ ఉండదు. ఇక్కడ పిండ ప్రదానాల కోసం వచ్చేవారు సమీపంలోని గయా స్టేషన్ వరకు టికెట్ తీసుకుంటారు. పున్‌పున్ నదిలో కార్యక్రమాలు పూర్తి చేసుకున్న తర్వాత, అదే టికెట్‌పై గయాకు ప్రయాణిస్తారు. కేవలం ఒక ధార్మిక కార్యక్రమం కోసం రైల్వే శాఖ ఒక స్టేషన్‌ను ఏర్పాటు చేయడం విశేషం.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com




## ఎదిరించను



ప్రేమ్: "లాలీ, నేను నిన్ను ప్రేమిస్తే ఎదిరిస్తావా?"

లాలీ: "అమ్మో! అలా చేయను"

ప్రేమ్: "ఏంటీ ప్రేమించవా?"

లాలీ: "అది కాదు.. ఎదిరించను అంటున్నా. మా నాన్న దగ్గర డబ్బు లేదు".

## టికెట్ తీసుకోలేదు..

బస్సులో ఒకతను నీరసంగా పడిపోయాడు. కండక్టర్ "ఇతనితో ఎవరైనా ఉన్నారా?" అని మిగతా ప్రయాణికులను అడిగాడు.

అది విని ఒకతను "హాస్పిటల్‌కు తీసుకెళ్లాలా?"

కండక్టర్ చిరాగ్గా "అది కాదయ్యా, ఇతను టికెట్ తీసుకోలేదు" అన్నాడు.

## తాగానని..

రజని: "నానీ, ఎందుకు తాగుతున్నావు?"

నాని: "విజ్జు పుట్టింటికి వెళ్లిపోయింది"

రజని: "ఎందుకు?"

నాని: "నేను తాగుతున్నానని వెళ్లిపోయింది"

## జాగ్రత్త

టీచర్: "నాగరాజూ, మీ అబ్బాయి గంజాయి తీసుకుంటున్నాడు. ఇంట్లో జాగ్రత్త".

నాగరాజు: "అలాగే టీచర్. ఇంట్లో తీసుకోడు, జాగ్రత్తగా ఉంటాడు".

## డాక్టర్ని కూడానా?

"ఆపరేషన్‌కి అన్నీ రెడీ చేస్తున్నాం. ఈ లిస్ట్‌లో వున్నవి తీసుకురావాలి" అన్నాడు కాంపౌండర్.

"సిరంజి, దూది, గ్లోవ్స్ కూడా మేం తెచ్చుకోవాలా?" అంది సావిత్రమ్మ.

"ఔను. అయ్యో! మరిచిపోయాను వాటితో పాటు ఒక బల్బు కూడా తీసుకురండి".

"డాక్టర్ని కూడా మేమే తెచ్చుకోవాలా?"

## ధరలు భరించలేక..

జైలువార్డెన్: సార్, జీవిత ఖైదీ తప్పించుకున్నాడు.

సూపరింటెండెంట్: పర్వాలేదు.. వారంలో తిరిగి వస్తాడు.

జైలువార్డెన్: ఎలా సార్? అంత నమ్మకంగా చెప్తున్నారు.

సూపరింటెండెంట్: బయట నిత్యావసరాల ధరలు తట్టుకోలేక తిరగి జైలుకే వచ్చేస్తాడు.

## జైల్లోనే..

పోలీస్: సార్, వీడు దొంగతనం చేసిన వస్తువులు చూస్తే మీరు షాక్ అవుతారు.

ఎస్.ఐ.: ఔనా? ఏమేం దొంగతనం చేసాడు?

పోలీస్: సోలార్ ప్యానెల్, ల్యాప్‌టాప్, సిసికెమెరా, తుపాకీ, ఇంకా...



ఎస్.ఐ.: ఇక ఆపు.. వీడు జైలు నుండి బయటకి రాకూడదు.

పోలీస్: ఇవన్నీ మన జైలు నుండే దొంగిలించాడు సార్.

ఎస్.ఐ.: ఆ...?

**– ఈ.ఎస్.మాధవన్**

## మా ఆవిడ వండుతోంది

"ఇంతకుముందు రోజూ ఇక్కడికి టిఫిన్ తినడానికి వచ్చేవాడివి. ఇప్పుడు రావటం లేదు. ఎందుకని?" అడిగాడు హోటల్ యజమాని తన రెగ్యులర్ కస్టమర్‌ని.

"మా ఆవిడతో అడ్జెస్ట్‌మెంట్ అయ్యాను" సమాధానమిచ్చాడు.

"అంటే? అర్థం కాలేదు" సందేహం వెలిబుచ్చాడు హోటల్ యజమాని.

"నేను తప్పు చేసినా, తను తప్పు చేసినా పొరపాటు నాదే అంటున్నాను. దాంతో చక్కగా వండిపెడ్తోంది" అన్నాడు.

## అమ్మకు చెప్తాను

"లెక్కల్లో సున్నా మార్కులొచ్చాయి. మొద్దువెధవా? నీకు సిగ్గనిపించటం లేదా?" కోప్పడ్డాడు తండ్రి.

"ఇంకా ఒక్క తిట్టు తిట్టావంటే పొద్దున పనిమనిషిని ముద్దు పెట్టుకున్న విషయం అమ్మకు చెప్తాను" అన్నాడు, గడుసరి కొడుకు.

## రాళ్లు ఏరటం

"శశీ! ట్యూషన్‌లో ఏం నేర్చుకున్నావు?"

"బియ్యంలో రాళ్లు ఏరటం"

"అదేంటే?"

"మా ట్యూషన్ టీచర్ రోజూ అదే పాఠం చెప్తోందమ్మా!"

## ఫోన్ చేయమని..

"పనిమనిషిని ఇవాళ ఎందుకాలస్యమైందని అడిగితే పని మధ్యలో మానేసి ఈ చీటీ పెట్టి వెళ్లిపోయిందండీ" అంది భార్య భర్తతో.

"ఆ చీటీలో ఏం రాసింది?"

"మీ ఆయన నాకు పది వేలు యివ్వాలి. మీకివ్వవలసిన రెండు వేలు కట్ చేసుకుని మిగతావి నా సెల్ నంబర్‌కు ఫోన్ పే చేయమని రాసింది.."

**– వైదా ఈశ్వరరావు,** విశాఖ

## ‘సంఘీ’ భావం



# జీఎస్‌టి సంస్కరణలతో సామాన్యులకు మేలు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్‌టీ పన్ను విధానం వల్ల అటు దేశానికి, ఇటు సామాన్యులకు ఎంతో మేలు కలుగుతోంది. ముఖ్యంగా ఎప్పటికప్పుడు పన్నుల అంశాలపై సమావేశాలు నిర్వహించడం ద్వారా సంస్కరణలను తీసుకురావడం చక్కటి ఫలితాలను ఇస్తోంది. ఇటు కేంద్రానికి, అటు రాష్ట్రాలకు జీఎస్‌టీ పన్ను విధానం ఆర్థిక వెసులుబాటును కలిగిస్తోంది. ప్రస్తుతం తాజాగా మరోసారి జీఎస్‌టీ శ్లాబ్‌లను మార్పు చేశారు. దీనితో 28 శాతం, 12 శాతం ఉన్న శ్లాబ్‌లు పూర్తిగా తొలగించారు. ఈ శ్లాబ్‌లలో ఉన్న వాటిని 5 శాతం, 18 శాతం ఉన్న శ్లాబ్‌లకు సర్దుబాటు చేశారు. అంతేకాకుండా అనేక వస్తువులు, సేవలపై పూర్తిగా పన్ను తొలగించి జీరో జీఎస్‌టి విధానాన్ని తీసుకువచ్చారు. అదేవిధంగా లగ్జరీ, ఆరోగ్యానికి హానీ కలిగించే వస్తువులు, వినోదాలపై ఏకంగా 40 శాతం ప్రత్యేక పన్ను విధానాన్ని అమలు చేస్తున్నారు. సరిగ్గా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం రోజున అంటే సెప్టెంబరు 22వ తేదీ నుంచి కొత్త శ్లాబ్ విధానం అమలులోకి వస్తుంది. ఇప్పటికే తగ్గించిన శ్లాబ్‌లతో అటు వాణిజ్య వ్యాపార వర్గాలు, ఇటు సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో ఆనందోత్సవాలు వెల్లడౌతున్నాయి. ముఖ్యంగా ఆటోమొబైల్ రంగం ఇప్పటి నుంచి తమ వాహనాల తగ్గుదల వివరాలను ప్రకటించారు. తక్కువ మొత్తంలో ఉన్న కార్లు, మోటారుబైకులు కొనుగోలు చేసే వినియోగదారులు ధరల తగ్గుదలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేన్సర్‌కు సంబంధించిన ఔషదాలపై గతంలో 12 శాతం పన్ను ఉండేది. ప్రస్తుతం అది పూర్తిగా తొలగించారు. వ్యక్తిగత బీమా పాలసీలపై ఇప్పటి వరకు 18 శాతం జీఎస్‌టీ ఉండేది. ప్రస్తుతం జీరో స్థాయికి చేర్చారు. విద్యార్థులు ఉపయోగించే మ్యాప్‌లు, గ్లోబ్‌లు గతంలో 12 శాతం వడ్డీ ఉండేది. ప్రస్తుతం జీరోగా మార్చారు. పెన్సిళ్లు, షార్ప్‌నర్స్, రబ్బర్లు, క్రేయాన్లు, నోట్ పుస్తకాలపై 5 శాతం పన్ను ఉండేది. ఇప్పుడు పూర్తిగా తొలగించారు. ఆహార పదార్థాలైన రొట్టెలు, పరోటా, చపాతీలు, పన్నీర్ వంటి వాటిపై 5 శాతం పన్నును పూర్తిగా ఎత్తివేశారు. ఇక హెయిర్ ఆయిల్, సబ్బులు, టూత్‌పేస్టులు, నమ్కీన్ బిస్కెట్లు, పాస్తా, కార్న్ ఫ్లేక్స్, తృణధాన్యాలు, వంట పాత్రలు, సైకిళ్లు, చెప్పులు, దుస్తులపై 12 నుంచి 18 శాతం వరకు జీఎస్‌టీని విధించేవారు. ప్రస్తుతం ఈ సరుకులకు కేవలం 5 శాతం శ్లాబ్ విధానంలోకి మార్చడంతో ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అదేవిధంగా ఆరోగ్యాన్ని పెంచే డ్రైఫ్రూట్స్, నట్స్ వంటి వాటిపై కూడా 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. ఇక శస్త్ర చికిత్సకు ఉపయోగించే పరికరాలపై ఉన్న 18 శాతం జీఎస్‌టీని ఎత్తివేసి కేవలం 5 శాతానికి తగ్గించారు. సెలూన్ సేవలు, యోగా కేంద్రాల సేవలకు కూడా 18 నుంచి 5 శాతానికి తగ్గించారు. వ్యవసాయ రంగంలోనూ అనేక వస్తువులపై జీఎస్‌టి శ్లాబ్‌లను తగ్గించారు. ఇటీవల కాలంలో మధ్య తరగతి కుటుంబీకులు సైతం కొనుగోలు చేస్తున్న ఎయిర్ కండిషన్లు, టెలివిజన్లు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, 1200 సిసి లోపు ఉన్న పెట్రోలు కార్లు, 1500 సిసి లోపు ఉన్న డీజిల్ కార్లు, మోటారుసైకిళ్లు, బస్సులు, ట్రక్కులు, ఆటోలు, అంబులెన్స్‌లు, సిమెంట్ తదితర వస్తువులపై 28 శాతం ఉన్న శ్లాబ్‌లను 18 శాతానికి తగ్గించివేశారు. దీనితో ఆయా వస్తువులు, వాహనాల ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఇక లగ్జరీ కార్లు, 350 సిసి సామర్థ్యం దాటి ఉన్న ద్విచక్ర వాహనాలు, ఎరేటెడ్, కార్బొనేటెడ్ పానీయాలు, పడవలు, వ్యక్తిగత విమానాలు, రివాల్వర్లు, పిస్తోళ్లు, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్, క్యాసినోలు, ఐపిఎల్ వంటి క్రీడా కార్యక్రమాల ప్రవేశ రుసుములుపై ఏకంగా 40 శాతం ప్రత్యేక పన్ను విధానాన్ని తీసుకువచ్చారు. గతంలో వీటిపై 28 శాతం జీఎస్‌టీ మాత్రమే ఉండేది. 40 శాతం ప్రత్యేక పన్ను విధానంలో ఉన్న వస్తువులు, సరుకులు, సేవలు గతంలో కూడా సామాన్యులకు, మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేవి కాదు. ప్రస్తుతం వాటిపై ఎక్కువ పన్ను వేయడం వల్ల సామాన్య జనాలకు పెద్దగా నష్టం కలగే అవకాశం లేదు. జీఎస్‌టీ పన్ను విధానంలో వచ్చే ఆదాయంలో 50 శాతం కేంద్రానికి, 50 శాతం రాష్ట్రాలకు వర్తిస్తుంది. శ్లాబ్‌ల తగ్గింపు, జీరో పన్ను విధానం అమలు వల్ల అటు కేంద్రానికి, ఇటు రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో ఆర్థిక నష్టం కలుగుతుంది. అయితే జీఎస్‌టీ పన్ను ఆన్‌లైన్ విధానంలో ఉండటం వల్ల ప్రతి క్రయ-విక్రయాల లావాదేవీలు పారదర్శకంగా ఉంటాయి.

వస్తువుల ధరలు తగ్గడం వల్ల డిమాండ్ పెరిగి ఆ మేరకు జీఎస్‌టీ ఆదాయం కూడా పెరుగుతుందని అంచనాలు వేస్తున్నారు. దీనివల్ల కేంద్రానికి, రాష్ట్రాలకు భవిష్యత్తులో మరింత ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ జీఎస్‌టీ అమలు తరువాత ధరలు తగ్గుముఖం పట్టడం ప్రజల్లో ఆనందం కలిగిస్తోంది.

**- డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**



తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని తలచుకోగానే ముందుగా భక్తులకు గుర్తుకు వచ్చేది మూడు నామాలు. ఆ మూడు నామాలు శ్రీ వేంకటేశ్వరుని దివ్య మంగళ రూపానికి ప్రత్యేకంగా కనిపిస్తాయి. ఈ మూడు నామాలు భక్తులకు పెద్దగా కనిపించేలా స్వామివారికి తీర్చిదిద్దుతారు. అలిపిరి మెట్ల దారిలో నడిచివెళ్ళే భక్తులకు మూడు నామాల కొండ కనిపిస్తుంది. అదే మోకాళ్ల పర్వత గోపురం. సాక్షాత్తు భగవంతుడు మూడు నామాలు ధరించి తన భక్తులు కూడా మూడు నామాలు ధరించాలని చెప్పినవే. ఈ నామాలు అజ్ఞానాన్ని, కర్మను ఖండిస్తాయని వివరిస్తాయి.

# అఖిలాండ నాయకుని ఆనంద ఉత్సవం

కవర్ స్టోరీ

**పావులూరు పద్మనాభమ్**

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ మహావిష్ణువు కలియుగంలో ఏడుకొండలుగా పిలవబడే శ్రీ వేంకటాచలంపై శ్రీ వేంకటేశ్వరునిగా కొలువై ఉన్నాడు. అంతటి ఆనందరూపుడు, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని వేల సార్లు దర్శించి తరించిన అన్నమాచార్యులు స్వామివారి ముగ్ధ మనోహర రూపాన్ని సంకీర్తనలో మన కళ్లెదుట ప్రత్యక్షం చేశారు. మహిమాన్వితమైన దేవదేవుని బ్రహ్మోత్సవాలు కనులారా భక్తులందరూ చూసి తరించాల్సిందే.

ఆనాడు అన్నమాచార్యులు బ్రహ్మోత్సవాల పెద్దగా వ్యవహరించి, ఆయనే స్వయంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించేవారు. పది రోజులు స్వామిని సేవించి కీర్తించేవారు. పది రోజుల సేవలను, శ్రీ వేంకటేశ్వరుని వైభవాన్ని పై సంకీర్తనలో మన కళ్ళెదుట అన్నమయ్య ప్రత్యక్షం చేశాడు.

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి ఏటేటా బ్రహ్మోత్సవాలు జరగడం సంప్రదాయం. ప్రతి సంవత్సరం భక్తుల సంఖ్య ఇతోధికంగా పెరుగుతూ తిరుమలగిరులు గోవింద నామస్మరణతో ప్రతిధ్వనిస్తుంటాయి. భజన బృందాలు, కోలాటాలు, దైవిక, పౌరాణిక పాత్రధారణలతో, ఆధ్యాత్మిక ప్రవచనాలతో, నాద నీరాజనాలతో నిర్విరామంగా ఒక పవిత్ర శోభ సంతరించు కుంటుంది తిరుమల పుణ్యక్షేత్రం. నిత్య కళ్యాణ చక్రవర్తికి నిత్యోత్సవాలు, విశేష ఉత్సవాలు ఎన్నో.. ఎన్నెన్నో జరుగుతుంటాయి. అన్నిటి కంటే బ్రహ్మోత్సవాలు స్వయంగా సృష్టికర్త బ్రహ్మదేవుడే భగవదాజ్ఞతో ప్రారంభించి నిర్వహించడం ఈ ఉత్సవాల విశేషం. తొమ్మిది రోజుల వాహన సేవల్లో గరుడోత్సవం. రథోత్సవం, చక్రస్నానం మరింత అశేష జనసందోహంతో, భక్తిపారవశ్యంతో ఆనందోత్సాహాలతో స్వామివారిని అలరింపజేస్తాయి.

## మూడు నామాల దేవుడు

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు... ఆపద మొక్కుల

మొదటిసారి రామానుజాచార్యులు తన స్వహస్తాలతో శ్రీ వేంకటేశ్వరునికి మూడు నామాలు అలంకరించారట. తిరునామాలు అలంకరించడం స్వామివారికి ప్రత్యేకత. ప్రతి శుక్రవారం ఉదయం అభిషేక సేవ అనంతరం 16 తులాల పచ్చకర్పూరం, ఒకటిన్నర తులం కస్తూరితో మూడు నామాలు అలంకరిస్తారు. అవి మళ్ళీ గురువారం వరకూ అలానే ఉంటాయి. గురువారం కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవారి నేత్రాలు కనిపించేలా నామాన్ని కొంత తగ్గిస్తారు. శుక్రవారం ఉదయం మాత్రమే స్వామివారి అభిషేక సేవ సమయంలో మూడు నామాలు లేకుండా భక్తులకు దర్శనమిస్తారు.

వారానికి ఒకసారి మాత్రమే స్వామివారికి నామాలు దిద్దుతారు. తెలుపు నామాలు సత్వగుణాన్ని తెలియ జేస్తాయి. సత్వగుణం భక్తుల్ని ఉన్నత స్థితికి తీసుకెళ్తుందని సూచిస్తుంది నిలువుబొట్టు. ఇక ఎరుపురంగు అనురాగానికి ప్రతీక. ఎరుపు లక్ష్మీస్వరూపం. శుభసూచకం, మంగళకరమైనది కూడా. వైష్ణవులు వడగలై, తెంగలై అనే రెండు తెగలు ఉన్నారు. వడగలై 'యు' ఆకారంలో నామం దిద్దుకుంటారు. తెంగలై ఆంగ్ల అక్షరంలో 'వై' ఆకారంలో తిరుమానం దిద్దుకుంటారు. అయితే ఈ రెండు ఆకారాలకు మధ్యస్థంగా తమిళ అక్షరం 'ప'ను పోలి ఉంటుంది. దీన్నే తిరుమణికాపుగా పిలుస్తారు.

## బంగారు వరలక్ష్మి

ఏడు కొండల వేంకటేశ్వరుని దివ్య మంగళ రూపాన్ని దర్శించుకుని బంగారు వాకిలిలో వెలుపలకు వచ్చిన భక్తులు విమాన వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటారు.

అక్కడ నుండి ఆలయంలోపల స్వామివారి హుండీలో కానుకలు సమర్పించే ముందు ఎడమ వైపున ప్రాకారానికి పైన నిలువెత్తు 'బంగారు వరలక్ష్మి' ప్రతిమ అమర్చబడి ఉంది. ధన వర్షాన్ని కురిపిస్తూ భక్తులను అనుగ్రహించే ఈ అమ్మ, శ్రీనివాసుడికి సరిగ్గా ఈశాన్యంలో ఉండటం విశేషం. స్వామివారికి కానుకలు, మొక్కుబళ్లు సమర్పించిన భక్తులకు ఈ వరలక్ష్మి ఇబ్బడిముబ్బడిగా సంపదలు ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం.

## బ్రహ్మోత్సవ వాహనసేవలు

'బ్రహ్మ' అంతటివాడు ముందు నిలబడి జరిపించే ఉత్సవం కనుక 'బ్రహ్మోత్సవం' అనే పేరు వచ్చింది. ఏడు కొండల వేంకటేశ్వర స్వామికి సౌరమానం ప్రకారం కన్యా మాసంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. చాంద్రమానం ప్రకారం భాద్రపద మాసంలో, ఆశ్వయుజ మాసంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. అధిక మాసం వచ్చినపుడు తిరుమల తిరుపతి దేవస్థానం రెండు సార్లు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఒకటి: సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, రెండవది: నవరాత్రి ఉత్సవాలుగా జరిపిస్తారు. వైఖానస ఆగమం ప్రకారం మొదటి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం, ధ్వజావరోహణం తప్పనిసరి. రెండవ బ్రహ్మోత్సవంలో ఈ రెండూ ఉండవు. అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ఆరంభమవుతాయి.

## అంకురార్పణ

ఏడుకొండల శ్రీ వేంకటేశ్వరుని తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు అంకురార్పణ కార్యక్రమంతో అరంభమవుతాయి. మొదటి ఘట్టంగా ధ్వజారోహణం ముందురోజు సాయంకాలం అనంత, గరుడ, శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనులవారు మాడోత్సవాలకు బయలుదేరి తిరువీధుల్లో ఊరేగుతూ ఆలయానికి పడమర వైపు వసంతోత్సవ మండపంలో ఆలయ అర్చకులు భూదేవిని పూజించి, పుట్టమన్ను సేకరించి మళ్ళీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు. 'మృత్సంగ్రహణం'తో అలా తెచ్చిన మట్టిలో నవ ధాన్యాలను ఆరోపింపజేస్తారు. దీన్నే 'అంకురార్పణ' అంటారు.

## బ్రహ్మరథం

తొమ్మిది రోజుల ఉత్సవాల్లో బ్రహ్మ సారథ్యం సంకేతంగా ఎటువంటి ఉత్సవ మూర్తులు లేని ఖాళీ బ్రహ్మరథాన్ని ప్రతిరోజూ మలయప్ప స్వామి ఊరేగింపు ముందు నడిపిస్తారు. ఈ రథంలో నిరాకార, నిర్గుణ



స్వరూపంతో బ్రహ్మదేవుడు ఉండి ఉత్సవ కార్యాన్ని నిర్వహిస్తాడు. అందుకే ముందుగా ఈ రథం కదులుతుంటుంది.

## ధ్వజారోహణం

'నభూతో నభవిష్యతి' అన్నట్లుగా తొమ్మిది రోజులు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సకల దేవతలనూ



ఆహ్వానిస్తూ, స్వామివారి వాహనం గరుడుని చిత్రాన్ని కొత్త పసుపు వస్త్రంపై చిత్రీకరిస్తారు. దీన్ని ధ్వజస్తంభం మీదకు కట్టేందుకు నూలుతో చేసిన కొడితాడును సిద్ధం చేస్తారు. ఉత్సవ మూర్తులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారి సమక్షంలో మీన లగ్నంలో కొడితాడు కట్టి నూతన కేతాన్ని వేద పండితులు, ఆలయ అర్చకులు వేదమంత్రాలతో, మంగళ వాయిద్యాల నడుమ బంగారు ధ్వజ స్తంభంపై ఎగురవేస్తారు. ఈ ధ్వజారోహణం సందర్భంగా ముద్గలాన్నం(పెసర పులగం)నివేదిస్తారు. ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే సంతానాన్ని కోరేవారికి సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. బంగారు ధ్వజంపై ఆకాశానికెగసిన గరుడుడు బ్రహ్మోత్సవాలకు రావాలంటూ సకల సపరివార దేవతలను, భక్తులను ఆహ్వానిస్తారు.

## మొదటి రోజు రాత్రి పెద్ద శేషుని సేవ

తిరుమలేశుని బ్రహ్మోత్సవాలకు శ్రీకారంగా ధ్వజారోహణం జరిగిన రాత్రి తొలి వాహనంగా ఏడు పడగల బంగారు పెద్ద శేష వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి ఉత్సవం జరుగుతుంది. శ్రీనివాసుడు శేషాద్రిపై కొలువుదీరాడు. ఆయన పానుపు శేషుడు. అందుకే ఉత్సవాల్లో శేషుడికి ప్రాధాన్యమిస్తూ తొలిరోజు తొలి వాహనంగా పెద్ద శేష వాహనంపై ఊరేగుతారు. మన శరీరంలో మూలాధారం నుండి సహస్రారం వరకు సర్పాకారంలో ఉన్న కుండలీశక్తిని జాగృతం చేయమని బోధించడమే ఈ ఊరేగింపు అర్థం.



## చిన్న శేష వాహనం

బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు ఉదయం తిరుమలేశుని ఉత్సవమూర్తి మలయప్పస్వామి ఒక్కరే ఐదు పడగల చిన్న శేష వాహనంపై ఊరేగుతాడు. ఈ శేషుడు నారాయణ సంభూతుడు. స్వామికి-శేషునికి ఉన్న సంబంధం అటువంటిది. అందుకే రెండవ రోజు ప్రీతితో మళ్లీ శేష వాహనంపై దర్శనమిస్తాడు. ఈ చిన్నశేషుడే వాసుకి.

## హంస వాహనం

బ్రహ్మోత్సవాలలో రెండో రోజు రాత్రి శ్రీ స్వామివారు వీణాపాణియై సరస్వతి మూర్తిగా దర్శనమిస్తారు. హంస పాలలోని నీళ్లను వదలి పాలను తాగినట్లుగా భగవంతుడు పాపాలను క్షమించి వాత్సల్యంతో భక్తులను దగ్గరికి చేరదీస్తాడని చెప్పడం కోసం ఈ హంస వాహనం.



## సింహ వాహనం

బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు ఉదయం స్వామివారు సింహ వాహనంపై దర్శనమిస్తారు. మృగరాజైన సింహాన్ని సైతం నేనేనంటూ మనుషుల్లో జంతు స్వాభావికమైన హింసా వృత్తిని పోగొట్టుకోవాలని స్వామి ఉద్బోధ. అనంత తేజోమూర్తి శ్రీనివాసుడు. రాక్షసుల మనస్సులలో సింహంలా గోచరిస్తాడని స్తోత్ర వాఙ్మయం కీర్తిస్తుంది. భగవంతుని అవతారాలలో నృసింహ స్వామి అవతారం నాల్గవది. ధర్మరక్షణకై తాను నృసింహ రూపాన్ని ధరించిన స్వామి ఈ ఉత్సవాలలో సింహాన్ని అధిష్టించి రావడం దుష్ట శిక్షణ, శిష్ట జన రక్షణకు సంకేతం. వజ్రకిరీటం, చెవులకు రవ్వలపోగు, శ్రీవత్సం, లక్ష్మీకౌస్తుభం అలంకరణలో ప్రత్యేకత.

## ముత్యపు పందిరి వాహనం

బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు రాత్రి ముత్యపు పందిరి వాహనంపై శ్రీదేవి భూదేవిలతో మలయప్ప స్వామివారు ప్రత్యక్షమవుతాడు. ముత్యాలు విలువైనవి. చల్లదనాన్ని ప్రసాదిస్తాయి, తెల్లని కాంతులీనుతాయి. జ్యోతిష్య శాస్త్రం చంద్రునికి ప్రతీకగా ముత్యాలను ప్రశంసిస్తుంది. ఎంతో ప్రాశస్త్యమున్న ముత్యాలను పందిరిగా రూపొందించిన వాహనంలో దేవదేవుడు మురిపెంగా ముచ్చట గొల్పుతూ ఊరేగుతాడు. ముత్యం చంద్రునికి ప్రతీక. చంద్రుడు ఆరోగ్య ప్రదాత. సకల సౌభాగ్యాలను చేకూర్చుతుందని నమ్మకం.



## కల్పవృక్ష వాహనం

బ్రహ్మోత్సవాల వేళ నాలుగో రోజు ఉదయం మలయప్ప స్వామి ఉభయ నాంచారులతో కలసి ఊరేగే వాహనం కల్పవృక్ష వాహనం. దేవతలు, రాక్షసులు అమృతం కోసం పాల సముద్రాన్ని చిలుకుతున్నపుడు అందులోంచి అన్ని రుతువుల్లోనూ పచ్చగా ఉండి కోరినవారి కోర్కెలను తీర్చే కల్పవృక్షం పుట్టింది. ఈ కల్పవృక్షం ఐహిక సుఖాలను మాత్రమే ప్రసాదిస్తుంది. భక్తుల కోర్కెలను భగవంతుడు నెరవేరుస్తాడని చెప్పడానికి కల్పవృక్ష వాహనంపై స్వామి ఊరేగుతారని నమ్మకం.

## సర్వభూపాల వాహనం

బ్రహ్మోత్సవాల్లో నాల్గవ రోజు రాత్రి ఉభయ నాంచారులతో కలసి మలయప్ప స్వామివారు సర్వభూపాల వాహనంపై ఊరేగుతాడు. ఏడడుగుల ఎత్తు, పూర్తిగా బంగారు రేకులతో నిర్మించిన వాహనం దేవఛోడ వంశానికి చెందిన ముట్లకుమార అనంతరాయులు ఇచ్చిన వాహనాలలో ఇదొకటి. సర్వభూపాలురలలో దిక్పాలకులు కూడా చేరుతారు. తూర్పు దిక్కునకు ఇంద్రుడు, ఆగ్నేయానికి అగ్ని, దక్షిణానికి యముడు, నైరుతికి నిర్రుతి, పశ్చిమానికి వరుణుడు, వాయువ్యానికి వాయువు, ఉత్తరానికి కుబేరుడు, ఈశాన్యానికి పరమేశ్వరుడు అష్టదిక్పాలకులై విరాజిల్లుతున్నారు.

## మోహినీ రూపం

బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు ఉదయం శ్రీ స్వామివారు మోహినీ అవతారంలో జగన్మోహినిగా బంగారు పల్లకిలో సిగ్గులు, సోయగాలు ఒలకబోస్తూ దర్శనమిస్తాడు. పక్కనే శ్రీవారు దంతపు పల్లకిపై వెన్నముద్ద కృష్ణుడై మరో రూపంలో ఆలయం నుంచి వెలుపలకు విచ్చేస్తారు. ఉత్సవమూర్తి సహజంగా నిలబడిన రూపంలోగాక ఆసీనులైన భంగిమలో దర్శనమివ్వడం విశేషం.

స్త్రీలు ధరించే సకలాభరణాలతో స్వామివారిని అర్చకులు అలంకరించడం విశేషంగా చెప్పుకోవచ్చు. సాధారణంగా వరద భంగిమలో కనిపించే స్వామివారి కుడి హస్తం మోహినీ అలంకరణలో అభయహస్త ముద్రణతో వుంటారు. స్వామివారికి పట్టుచీర, కిరీటం, పైన రత్న ఖచితమైన సూర్యచంద్ర సావేరి, వజ్రపు ముక్కుపుడక, బులాకి, శంఖుచక్ర స్థానంలో రెండు వికసించిన స్వర్ణ కమలాలను అలంకరిస్తారు.



## గరుడ వాహనం

బ్రహ్మోత్సవాలలో ఐదవ రోజు రాత్రి జరిగే గరుడ వాహన సేవ అత్యంత విశిష్టమైనది. ఆలయంలో మూలవిరాట్టుకున్న మకరకంఠి, లక్ష్మీహారం తదితర వాటిని ఉత్సవ మూర్తులకు అలంకరించడం ఈ వాహన ప్రత్యేకత.

మలయప్ప స్వామివారు ఈ వాహనంపై ఊరేగడానికి ముందు తమిళనాడులోని విల్లిపుత్తూరు నుంచి వచ్చిన పూలమాలలను, గొడుగులను, చిలుకలను స్వామివారికి అలంకరిస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సమర్పించిన పట్టువస్త్రాలను గరుడ వాహనంలో స్వామివారికి అలంకరిస్తారు. కొత్త గొడుగుల నీడలో బంగారు గరుడినిపై వరద హస్తుడైన శ్రీ మలయప్పస్వామి భక్తులను కటాక్షించడం విశేషం.

## హనుమంత వాహనం

ఆనంద నిలయంలో కొలువైన దేవదేవుని బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు ఉదయం శ్రీ మలయప్ప ఒక్కడే హనుమంతున్ని వాహనంగా చేసుకుని తిరు మాఢవీధుల్లో ఊరేగుతాడు. త్రేతాయుగంనాటి రాముడు కలియుగంలో వేంకటేశ్వరుడని నిరూపించడం ఈ వాహనంలోని పరమార్థం. శ్రీరాముడే దేవుడని నిత్యం కొలిచిన భక్తుడు హనుమంతుడు. భక్తితత్పరతను చాటిన హనుమంతుడి ద్వారా భక్తులు స్ఫూర్తి పొందడానికి వీలుగా హనుమంత వాహనంపై స్వామి ఊరేగడం ప్రత్యేకత.

## స్వర్ణరథం

బ్రహ్మోత్సవాలలో ఆరో రోజు మధ్యాహ్నం ఉత్సవ మూర్తులకు అత్యంత వేడుకగా వసంతోత్సవం జరుగుతుంది. ఈ వసంతోత్సవం రంగనాయకుల మండపంలో నిర్వహిస్తారు. ఆ రోజు సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేతంగా మలయప్ప స్వామివారు బంగారు రథాన్ని అధిరోహిస్తాడు.

## గజవాహనం

ఆరో రోజు రాత్రి శ్రీ మలయప్ప స్వామివారు గజవాహనంపై ఊరేగుతారు. మొసలి బారికి చిక్కిన ఏనుగును మహావిష్ణువు రక్షించడం, గజేంద్ర మోక్షం. శరణాగతులైన వారిని తాను రక్షిస్తానని చెప్పడం కోసం గజవాహనంపై స్వామివారు ఊరేగుతారు. గజం అహంకారానికి ప్రతీక. అహంకారాన్ని అణచిన మనిషి ఆరాధ్యుడవుతాడు. అహంకారం భగవంతుని దగ్గర దాసోహమంటుంది.



## సూర్యప్రభ వాహనం

బ్రహ్మోత్సవాలలో ఏడో రోజు ఉదయం మలయప్ప స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతారు. సప్తగిరీశుడు మలయప్పస్వామి వజ్రకవచం ధరించి ఈ వాహనంపై ఒక్కరే ఉదయ సూర్యకిరణాలు ప్రసరిస్తుండగా తిరువీధుల్లో ఊరేగుతాడు. సూర్యుడు కర్మసాక్షి. చరాచర ప్రపంచానికి వెలుగును ప్రసాదించే ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరుడు. సూర్య మండల మధ్యస్థుడుని శంఖు, చక్ర, గదాయుధారి అనే అర్థంతో సూర్యప్రభ వాహనం ఉంటుంది.



## చంద్రప్రభ వాహనం

బ్రహ్మాండ నాయకుని ఉత్సవాల్లో ఏడో రోజు రాత్రి మలయప్ప స్వామి చంద్రప్రభ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షిస్తారు. చంద్రుడు ఓషధీశుడు, భగవంతుడు చంద్రుని రూపంలో ఓషధులను పోషిస్తున్నాడనే అర్థంలో చంద్రప్రభ వాహనం వుంటుంది. చంద్రోదయం కాగానే కలువలు వికసిస్తాయి. సాగరుడు ఉప్పొంగుతాడు. చంద్రకాంతమణులు స్రవిస్తాయి. చంద్రుని వల్ల ఆనందం, చల్లదనం కలుగుతుంది.

## రథోత్సవం

బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజు ఉదయం రథంలో శ్రీ భూసహితంగా మలయప్ప ఊరేగుతారు. శరీరమే ఒక రథం. పంచేంద్రియాలు గుర్రాలు. మనసు వాటిని అదుపు చేసే పగ్గం. ఆత్మ రథచోదకుడు స్వామివారు అని శాస్త్రాలు చెబుతున్నాయి.

# వాహన సేవలతో ముక్తి

వేంకటాద్రిపై సాలగ్రామ అర్చనా మూర్తిగా, స్వయంభువుగా ఆవిర్భవించిన శ్రీ వేంకటేశ్వరునికి జరిపించే తొమ్మిది రోజుల ఉత్సవాల్లో ఒక్కోరోజు ఒక్కో వాహనసేవకు ఎంతో విశిష్టత ఉంది. ఈ వాహనాలపై పలు రకాల అలంకారాల్లో కొలువుదీరే ఏడుకొండలదేవుడు తన చెంతకు వచ్చిన భక్తులను కటాక్షించి వారి కష్టాలను తొలగిస్తాడనేది కోట్లాదిమంది భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవాలను వీక్షించడానికి దేశ విదేశాల నుంచి ఏదో ఒకరోజు తిరుమలకు చేరుకుని కళ్లారా వీక్షించేందుకు ఉత్సాహం చూపుతుంటారు. ఇలా రోజూ మాడవీధుల్లో ఊరేగే ఒక్కో వాహనం ద్వారా ఒక్కో ముక్తి ప్రాపిస్తుందని పురాణాల కథనం.

## సెప్టెంబరు 24 నుండి అక్టోబరు 2 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు

| తేదీ | ఉదయం | రాత్రి |
|---|---|---|
| **సెప్టెంబరు** 24 బుధవారం | ధ్వజారోహణం | పెద్ద శేష వాహనం |
| 25 గురువారం | చిన్న శేష వాహనం | హంస వాహనం |
| 26 శుక్రవారం | సింహ వాహనం | ముత్యపుపందిరి వాహనం |
| 27 శనివారం | కల్పవృక్ష వాహనం | సర్వభూపాల వాహనం |
| 28 ఆదివారం | మోహినీ అవతారం | గరుడ వాహనం |
| 29 సోమవారం | హనుమంత వాహనం, (సాయంత్రం)స్వర్ణరథం | గజ వాహనం |
| 30 మంగళవారం | సూర్యప్రభ వాహనం | చంద్రప్రభ వాహనం |
| **అక్టోబర్** 1 బుధవారం | రథోత్సవం | అశ్వవాహనం |
| అక్టోబర్ 2 గురువారం | పల్లకీ ఉత్సవం/ చక్రస్నానం | ధ్వజావరోహణం |

ఈ భావాన్ని చాటిచెప్పడానికే రథంలో ఆలయ మాడ వీధులలో శ్రీవారిని అధిరోహింపజేసి ఊరేగిస్తారు. భక్తులు ఈ రథాన్ని గోవింద నామ స్మరణలతో లాగడం భక్తికి నిదర్శనం. సకల జీవులలో అంతర్యామిగా వున్న పరమాత్మ తన రథాన్ని తానే లాగుతున్నాడని అనడం మరింత విశేషం.



### అశ్వవాహనం

బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజు రాత్రి జరిగే అశ్వవాహనం చివరిది. కలియుగాంతంలో శ్రీనివాసుడు అశ్వవాహనంపై కల్కి అవతారంలో వచ్చి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తాడని చెప్పడమే ఈ వాహన సేవ ఉద్దేశం. భక్తుల కలిదోషాలను హరించేవాడు, శుభాలనొసగువాడు. ఇంద్రియాలను గుర్రాలుగా చెప్పడం, గుర్రాలను అదుపులోకి తెచ్చుకోవాలనడం ఆధ్యాత్మిక విషయం. ఇంద్రియ శాసకుణ్ణి



నేనే అనే అర్థంలో ఈ వాహనం జరుగుతుంది. పద్మావతి-శ్రీనివాసుల తొలిచూపు వేళ, ప్రణయవేళ, పరిణయ సమయంలో అశ్వం సాక్ష్యంగా నిలిచిందని పురాణాల గాథ.

### చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో తొమ్మిది రోజులు ఉదయం, రాత్రి జరిగే వాహన సేవల్లో స్వామివారు భక్తులను కటాక్షించి మీ రక్షణకు నేనున్నానంటూ అభయమిస్తారు. అందుకే చివరగా భక్తుల పాపాలు తొలగిపోవడానికి వేల పుణ్యతీర్థాలు కలిసే పవిత్రమైన శ్రీవారి పుష్కరిణిలో శ్రీ సుదర్శన చక్రత్తాళ్వారులకు చక్రస్నాన మహోత్సవం జరిపిస్తారు. ఆలయానికి పక్కనే వున్న ఈ పుష్కరిణిలో బ్రహ్మోత్సవాలు చివరి రోజు తెల్లవారుజామున శ్రీదేవి భూదేవిలతో మలయప్ప స్వామివారు పల్లకిపై, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వారు మరో పల్లకిపై పుష్కరిణి వద్దకు చేరుకుంటారు. అక్కడ అర్చకులు, జియ్యంగార్లు వేద పఠనం, శ్రీసూక్తంతో ఉత్సవ మూర్తులకు అభిషేకాదులు నిర్వహిస్తారు. తరువాత శ్రీ సుదర్శన చక్రత్తాళ్వారును శ్రీవారి పుష్కరిణిలో మూడు సార్లు ముంచి పవిత్ర స్నానం చేయిస్తారు.

### ధ్వజావరోహణం

బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజు రాత్రి ధ్వజావరోహణం ఉత్సవం ఆలయంలో జరుగుతుంది. శ్రీదేవి భూదేవిల మలయప్పస్వామి సమక్షంలో వేదపారాయణలతో, భేరీ నినాదాలతో మంగళవాద్యాలతో బ్రహ్మాది దేవతలకు, అష్టదిక్పాలకులకు వీడ్కోలు చెబుతూ గరుడకేతనాన్ని ధ్వజస్తంభంపై నుంచి కిందకు దించుతారు.

ఫొటోలు: టి.శ్రీనివాసులు, కె.ఆర్.కిశోర్

## "చిరస్మరణీయంగా శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు"



**– బి.ఆర్.నాయుడు, టిటిడి ఛైర్మన్**

తిరుమల దివ్యక్షేత్రంలో సెప్టెంబర్ 24వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జరుగనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలను చిరస్మరణీయంగా నిర్వహిస్తామని, ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని టిటిడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు తెలిపారు. బ్రహ్మోత్సవాల వాహన సేవలు జరిగే తొమ్మిది రోజులు విశేష సంఖ్యలో విచ్చేసే భక్తులకు శ్రీవారి మూలమూర్తితో పాటు సంతృప్తికరంగా వాహన సేవలు వీక్షణం కల్పిస్తాం. దర్శనం, బస, అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 24వతేదీ బ్రహ్మోత్సవాలు మొదలయ్యే తొలి రోజునే సిఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వం తరపున స్వామివారికి సమర్పిస్తారు. శ్రీవారి ఆలయం, ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో శోభాయమానంగా విద్యుద్దీపాలంకరణలు, పుష్పాలంకరణలు చేపడుతున్నారు. భక్తులు ప్రశాంతంగా తిరుమలకు వచ్చి శ్రీ వేంకటేశ్వరస్వామి వాహన సేవలు వీక్షించి ముక్తి పొందాలని కోరారు.

## "సమష్టిగా పనిచేసి సామాన్య భక్తులకు పెద్దపీట"



**–అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి**

వేంకటేశ్వర స్వామికి ఈ ఏడాది ఒక బ్రహ్మోత్సవం మాత్రమే నిర్వహిస్తున్నాం. వార్షిక బ్రహ్మోత్సవాలకు దసరా సెలవులు కూడా ప్రారంభమవుతున్నాయి. గతం కంటే ఎక్కువగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం. అందుకు తగ్గట్లుగా అన్ని విభాగాలవాళ్ల విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా ఈ యేడాది వాహనాల పార్కింగ్ సౌలభ్యానికి, ట్రాఫిక్ సమస్యలు అధిగమించడానికి చర్యలు తీసుకున్నాం. ఆయా ప్రాంతాల నుండి తిరుమలకు చేరుకోవడానికి ఏపిఎస్ ఆర్టీసి వాహనాలు నడుపుతుంది. భక్తులు కూడా టిటిడి విజిలెన్స్, పోలీసు సిబ్బందికి సహకరించాలి. భక్తుల సౌకర్యార్థం 28వ తేదీ గరుడ వాహనసేవను రాత్రి 6.30 గంటలకే ప్రారంభిస్తాం. ఆ రోజు ఉదయం వాహన సేవ ముగియగానే మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి భక్తులను అనుమతించనున్నాం. గ్యాలరీల్లో వేచి ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ, కాఫీ, సుండలు శ్రీవారి సేవకులు అందిస్తారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఎల్ఇడిల ద్వారా వాహన సేవలు తిలకించే విధంగా చర్యలు తీసుకున్నాం.

## "మాడవీధుల్లో తోపులాట లేకుండా పటిష్టంగా ప్రవేశ ద్వారాలు

**–టిటిడి ఇఒ ఎకె సింఘాల్**



తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయనున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశాం. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన విధులను చిత్తశుద్ధితో మానవసేవే మాధవసేగా భావించి పని చేస్తామని టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు మాడవీధుల్లోని గ్యాలరీల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం.

## "భద్రతా పరంగా సాంకేతికత వినియోగం"

**– టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ**

భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని భద్రతా పరంగా సాంకేతికత వినియోగిస్తాం. ఆలయ మాడవీధుల్లో



సామాన్య భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు సాఫీగా ఏర్పాటు చేసి, సూచిక బోర్డులు ఏర్పాటు చేశాం. గ్యాలరీల్లో నిరంతరాయంగా భక్తులకు సేవలందించే సిబ్బంది, శ్రీవారి సేవకులు, భద్రత సిబ్బంది సమన్వయంతో సేవలందించేలా చూస్తాం.

## "సాఫీగా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు"

**– తిరుపతి జిల్లా ఎస్పి సుబ్బరాయుడు**

భక్తుల సంఖ్యకు తగ్గట్లు భద్రత పరంగా అధునాతన సాంకేతికతతో పోలీసులు పని చేస్తున్నారు. గ్యాలరీల్లోకి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు సాఫీగా ఉండేలా ఏర్పాటు చేశాం. స్వామివారి బ్రహ్మోత్సవాలకు అశేషంగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. అంచనాలకు తగ్గట్లు భక్తుల వాహనాలు సరైన ప్రాంతంలో పార్కింగ్ చేసుకునేలా తగిన ఏర్పాట్లు చేశాం. తిరుమలలో జిఎన్‌సి టోల్‌గేట్ వద్దకు చేరుకున్న తరువాత భక్తులు వాహనాల్లో ఎటు వెళ్ళాలనే సూచనలు పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా సూచించేలా మార్పుచేశాం.

పది చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నాం. భక్తులకు అసౌకర్యం కలగకుండా పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి, టిటిడి విజిలెన్స్, ఇంజనీరింగ్ విభాగంతో సమన్వయంగా



వ్యవహరిస్తాం. భద్రతా పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ముందస్తు సూచనలు, చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు నాలుగు వేల మంది పోలీసు అధికారులు, సిబ్బంది, ఆక్టోపస్ బలగాలు విధుల్లో నిమగ్నమవుతున్నారు.

# శ్రీవారి ప్రసాద విశేషాలు



తిరుమలలో రుచిగా, శుచిగా ఆలయం లోపల పడిపోటులో వకుళమాత పర్యవేక్షణలో తయారయ్యే మహా మహా ఎన్నో నైవేద్యాలు కులశేఖర పడి దాటి గర్భాలయపు గడప అవతలి నుండే సమర్పిస్తారు. ఒటికుండలోని ధద్యోదనం మాత్రం నేరుగా మూలవిరాట్టు పాదాల చెంతకు చేరుతుంది. తిరుమల లడ్డూకు 310 యేళ్ళ చరిత్ర ఉంది.

**ప్రోక్తం(సాధారణ)లడ్డు:** సాధారణంగా అన్ని రకాల దర్శనాలకు ఇచ్చే ప్రసాదం లడ్డు ఇది. **ఆస్థానం లడ్డు:** ఈ లడ్డూ ప్రసాదాలను ప్రత్యేక సందర్భాల్లో తయారు చేసి అత్యంత ప్రముఖులకు, ఆలయ గౌరవ అతిథులకు మాత్రమే ఇస్తారు.

**కళ్యాణోత్సవం లడ్డు:** కళ్యాణోత్సవం ఆర్జిత సేవలో పాల్గొనే భక్తులకు ఈ కళ్యాణం లడ్డు(పెద్ద లడ్డు)ఉచితంగా ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ పెద్ద లడ్డూలను గృహస్థ భక్తులు, సాధారణ భక్తులకు 200 రూపాయలకు (నిల్వ ఉన్నవరకు) విక్రయిస్తున్నారు.



**తొలి గంట: సుప్రభాత సేవలో** వేడి పాలు, నవనీతం నివేదించిన తరువాత ఆ రోజు ఆస్థానంలో పంచాంగ శ్రవణం జరుగుతుంది. ఆదాయ–వ్యయాల చిట్టాను స్వామివారికి అర్చకులు వినిపిస్తారు. ఆ తరువాత నువ్వుల పిండి సమర్పిస్తారు. **సహస్ర నామార్చన** తరువాత స్వామి వారికి తొలిగంట తొలి నైవేద్యం సిద్ధం చేస్తారు. ఆ సమయంలో పులిహోర, పొంగలి, ధద్యోదనం, చక్కెరపొంగలి, లడ్డూలు, వడలు, అప్పాలు తదితరాలు నివేదిస్తారు.

**రెండో గంట: అష్టోత్తర శత నామార్చన** తరువాత రెండో నైవేద్యం సిద్ధమవుతుంది. అన్న ప్రసాదాలు, సీరా, పాయసం, కేసరీబాత్, క్షీరాన్నం, కదంబం స్వామివారికి ఇష్టపూర్వకంగా సమర్పిస్తారు. ఆ తరువాత **కళ్యాణోత్సవం సేవలో** నిత్య పెళ్ళికుమారుడు శ్రీనివాసుడుకి లడ్డూలు, వడలు, అప్పాలు, దోసెలు ఆరగిస్తాడు. ఇక పంచకజ్జాయం అంటే దేవదేవునికి పంచప్రాణాలు. చక్కెర, గసగసాలు, కలకండముక్కలు, ఎండుద్రాక్ష, బాదంపప్పు పలుకులు, ఎండుకొబ్బరికోరు కలగలిపిన తీపి పదార్థం. డోలోత్సవం, **సహస్ర దీపాలంకార సేవలో**



దీన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. సాయంత్రం **తోమాల సేవ** అయిన తరువాత తోమాల దోసెపడి సమర్పిస్తారు. ఆ తరువాత మూడో గంటలోనూ రకరకాల పొంగళ్ళు, కదంబాలు సమర్పిస్తారు. రాత్రికి తిరువీసం గంటలో చక్కెరపొంగలి మాత్రమే నివేదిస్తారు. **ఏకాంత సేవలో** వెండి పాత్రలో వేడి చేసి చల్లార్చిన గోరువెచ్చని పాలు, పండ్లు, పంచకజ్జాయం, మేవా పంచామృతం సమర్పిస్తారు.



రోజువారీగా ఇవేగాక వారాంతపు సేవల్లో సోమవారం మలయప్పస్వామికి **విశేషపూజలో** పెద్దవడలు, లడ్డూలు, అన్నప్రసాదాలు సమర్పిస్తారు. బుధవారం బంగారు వాకిలి వద్ద జరిగే **సహస్ర కలశాభిషేకం సేవలో** అదనంగా క్షీరాన్నాలు వడ్డిస్తారు. గురువారంరోజు **తిరుప్పావడ సేవలో** దాదాపు 420 కిలోల బియ్యంతో చేసిన పులిహోరను బంగారు వాకిలి ముందు రాశిగా పోస్తారు. జిలేబీలు, మురుకులు శ్రీవారికి నైవేద్యంగా నివేదిస్తారు. శుక్రవారం అభిషేక సేవలో సఖియలనే రుచికరమైన ఉండ్రాళ్ళు, ఆదివారం చలిపిండి నైవేద్యం ఫలహారంగా సమర్పిస్తారు. ఇలా రోజువారీ నైవేద్య ప్రసాదాలు నివేదన ఒక ప్రత్యేకత అయితే వారపు సేవల్లో స్వామివారికి సమర్పించే నైవేద్యాలు, పండివంటలు ప్రత్యేకం.



**సోమవారం:** 51 పెద్దదోశలు, 51 చిన్నదోశలు, 51 పెద్ద అప్పాలు,102 చిన్న అప్పాలు, **మంగళవారం** ప్రత్యేక ప్రసాదాలు ఏమీ ఉండవు. **బుధవారం:** పెసరపప్పు, పానకం, పాయసం. **గురువారం:** తిరుప్పావడ సేవలో 51 పెద్ద జిలేబీలు, 51 తేనెతోళీలు, వడలు, పాయసం. **శుక్రవారం:** అభిషేకం రోజున 51 పోళీలు, పాయసం. **శనివారం:** రోజువారీ నైవేద్యాలు మాత్రమే సమర్పిస్తారు.

**ఆదివారం:** అమృతకలశం, గరుడ ప్రసాదం. స్వామివారి వాహనం గరుడునికి సర్పాలంటే జాతివైరం. సర్పదోష పీడితులై సంతానలేమితో బాధపడుతున్నవారు ఈ ప్రసాదం సేవిస్తే తప్పకుండా సంతానప్రాప్తి కలిగిస్తాడు.

# వెండి వెన్నెలలా..

నల్లని కురుల హొయలతో
చల్లని హరిత పత్ర రమణీయతతో వనమయూరిలా
గోచరింప
పువ్వులు సైతం
మేమున్నామంటూ
ఆ చెలి అందానికి
పోటీగా నిలిచిన
శుభారుణ శుభతరుణం
ఓ... అందమైన ఆభరణం
నిరాడంబరతకు నిలువుటద్దం
ఆ మత్తయిన చల్లని చూపు
చూసినప్పుడల్లా నాలో నేను
అల్లకల్లోలమై పోతూ
కలిగే కలవరపాటును
ఈ కవి ఎలా దాచగలడు..
ననుదోచిన ఆ చెలి నయన వదనంలో
మల్లెల బృందావనాన్ని
చూడాలనే ఆసక్తిని ఎలా తెలుపగలను
మబ్బు దొంతరలతో సయ్యాటలాడుతున్న
వెండి వెన్నెలలా గోముగా ఆ చెలిని
బుజ్జగించాలనే చిలిపి అల్లరిని
ఎలా దాచగలను చెలీ...
ప్రణయ భావాలను కలిగించే
ఆ చెలిమోమును నా కబంధహస్తాలతో
బంధించాలనే ఆసక్తిని
ఎలా అణుచుకోగలను
నులివెచ్చని ఆ చెలి ఊపిరి నాదస్వరంలా
ఈ కవి జీవితం మలయమారుతం
కావాలనే ఈ చిరు ఆశను
ఎలా నిజం చేసుకోను
ఓ... కోమలి
ఆ గాజుల గలగల శబ్ద తరంగాలు
ప్రేమ తరంగాలై ఈ కవిని
ఆ సవ్వడులు పరవశింప చేసినట్లు
ఓ... తీయని మధురమైన అనుభూతి
దరిచేరవా చెలి మురిపించి మరిపించి
మైమరిపించ కదలి రావా చెలి
నను కలవర పరచగ...

– డా॥ కొరుప్రోలు హరనాథ్

ఈ వారం కవిత్వం





## నాన్నమ్మ కథలు

నాన్నమ్మ కథలు సుమనోహర
రాగమై,
ప్రేమతో నిండిన హృదయ
ఆలయమై,
మమతల మాటలతో మార్గం
చూపును,
జీవన గీతంలో స్వరమై వెన్నంటును!
నానమ్మ నీడవలె చిరస్థాయిగా
కాచును,
ఆమె నవ్వు గుండెలో గంధపు
పరిమళమై,
కథల సముద్రంలో స్వప్నంలా
విహరించును,
ఆమె స్పర్శ తామర తాకిడిలా
సున్నితమై!
ఆమె మాటలు జ్ఞాన దీపమై
నడుపును,
ప్రేమతో నడిపెను జీవన బాటలో,
నాన్నమ్మ హృదయంలో నిత్యం
నిలిచెను,
కాలాన్ని జయించిన కాంతి కిరణమై!.

– రాము కోలా

## అచంచల యాత్ర

నదిలా సాగిపోతుంది జీవితం,
అప్పుడప్పుడు కలతలతో, ఎప్పుడో
కలలతో.
కొన్ని సార్లు ముంచెత్తే అలలతో,
కొన్ని సార్లు నిశ్శబ్దం కమ్మే తీరాలతో.
వర్షపు చినుకుల్లా ఆశలు పుడతాయి,
మబ్బుల చీకట్లలా నిరాశలు
కమ్ముకుంటాయి.

పగలు–రాత్రుల మార్పులా
జీవితం క్షణం క్షణం రంగులు
మార్చుకుంటుంది.
నవ్వులు, కన్నీళ్ల కలిసిన రాగమే ఇది,
ప్రతి ఓటమిలో ఒక పాఠం,
ప్రతి విజయంలో ఒక కర్తవ్యం దాగి
ఉంటుంది.

తీరానికి చేరేవరకు ఆగని యాత్రే జీవితం,
మనసు నమ్మిన దారిలో
నడుస్తూ ముందుకు సాగాల్సిందే.

– డాక్టర్ మామిడాల శైలజ

# నేటి ఆర్థిక అక్షరాస్యత భవితకు పునాది..

**ధనం మూలం ఇదం జగత్..** ప్రపంచం ధనంతోనే నడుస్తుంది. డబ్బు ఎవరికీ చేదు కాదు. "ధనమేరా అన్నిటికీ మూలం. ధనం విలువ తెలుసుకొనుట మానవ ధర్మం.." డిజిటల్ యుగంలో ఆర్థిక వనరులే అన్నింటినీ శాసిస్తున్నాయి. నేటి మానవ బంధాలన్నీ వాణిజ్య బంధాలుగా మారాయి. డబ్బు సంపాదించడం ఒక ఎత్తు, సంపాదించిన డబ్బును వినియోగించడం మరో ఎత్తు. ఎంత సంపాదించామన్నదాని కన్నా ఎంత ఆదా చేస్తున్నామన్నది ముఖ్యమని.. మన జీవిత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. ఆర్థిక క్రమశిక్షణ కొరవడిన కుటుంబాలు బజారున పడడం చూస్తున్నాం. ఆదాయాన్ని క్రమ ప్రణాళికతో ఖర్చు చేయడం వల్ల ఆ వ్యక్తితో పాటు కుటుంబం కూడా సుఖ సంతోషాలతో, ధైర్యంగా జీవనయానం కొనసాగిస్తారు. అనాలోచితంగా, విచ్చలవిడిగా ఖర్చు చేసినవారు ఎంత సంపాదించినా ప్రయోజనం శూన్యమే. నేటి ఆదాయం రేపటికి పునాది కావాలి. ఆర్థిక క్రమశిక్షణ చిన్నతనం నుంచే అలవాటు కావాలి. ఉన్నత విద్యావంతుల్లో కూడా ఆర్థిక నిరక్షరాస్యత కనిపిస్తోంది. ఆర్థిక అవగాహన లేమితో కుటుంబాలు అశాంతి నెలవులుగా మారుతున్నాయి. నేటి పిల్లలు, యువతలో ఆర్థిక నిరక్షరాస్యత రాజ్యమేలుతున్నది. ఎంత సంపాదించామన్నది ముఖ్యం కాదని, ఆదాయంలో ఎంత పొదుపు చేశామన్నదే ప్రధానమని మరిచిన ఏఐ ప్రపంచంలో మనం ఉన్నాం.

మన విద్యా వ్యవస్థలో కూడా ఆర్థిక అక్షరాస్యతను బోధించడం లేదు. చిన్న పిల్లలకు పాకెట్ మనీ ఇచ్చినపుడు వారు గల్లగురిగిలో వేసి దాచుకోవడం మనకు తెలుసు. అదే అలవాటు క్రమంగా ఆర్థిక క్రమశిక్షణకు పునాదిగా మారుతుంది. చిన్నతనంలోనే విచ్చలవిడిగా ఖర్చు చేయడం అలవాటయితే రేపటి వారి భవిత అంధకారంలోకి జారి పోవడం ఖాయమని తెలుసుకోవాలి. పిల్లాడి స్థాయిలో అలవాటు అయిన ఆర్థిక క్రమశిక్షణ రేపటి కుటుంబ శాంతికి పునాదిగా మారుతుంది.




## విచక్షణారహిత ఖర్చుతో ఆర్థిక చిక్కులు

పొదుపు చేయడం, ఆర్థిక ప్రణాళికలు వేయడం, కనీస ఖర్చులు చేయడం, తప్పని పరిస్థితుల్లో అప్పు చేయడం, ఆస్తులను పెట్టుకోవడం లేదా కాపాడుకోవడం లాంటి అంశాల గురించి పిల్లల్లో అవగాహన కలిగించాలి. మన నెలసరి ఆదాయంలో కొంత కుటుంబ ఖర్చులకు, కొంత పిల్లల చదువులకు, కొంత అత్యవసర సామాజిక ఖర్చులకు వెచ్చించిన పిదప తప్పనిసరిగా కొంత డబ్బును పొదుపు లేదా ఆదా చేయడం అలవాటుగా మారాలి. నేడు పొదుపు చేసిన ధనం రేపటి ఊహించని అత్యవసర సమయాల్లో మనల్ని ఆదుకుంటుంది. పొదుపు చేసిన డబ్బును సరైన పద్ధతిలో పెట్టుబడి పెడుతూ, మన ఆస్తిని పెంచుకోవచ్చు.

ఉద్యోగ నిర్వహణలో నైపుణ్యాలు ఉన్నట్లే, మన ఆదాయాన్ని సరైన పద్ధతిలో ఖర్చు చేసే ఆర్థిక నైపుణ్యాలను కూడా నేర్చుకోవాలి. చిరిగిన బట్టలు వేసుకోవడం, తెగిన చెప్పును తిరిగి తిరిగి వాడడం, కనీస అవసరాలకు ఖర్చు చేయకపోవడం, తింటే ఖర్చు అవుతుందని కాలే కడుపుతో పడుకోవడం.. లాంటివని పిసినారి గుణాలుగా భావిస్తాం. విలాసాలను కూడా కనీస అవసరాలు అనుకుంటూ, గోరుతో పోయేదానిని గొడ్డలి దాకా తెచ్చుకున్నట్లు, తక్కువ ఖర్చుతో జరిగే పనికి అనేక రెట్లు అధికంగా ధనాన్ని నీళ్లలా ఖర్చు చేయడం వల్ల భవిష్యత్తు చిక్కుల్లో పడుతుంది, రుణ విష వలయంలోకి నెట్టి వేస్తుంది.

## దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుందాం

డబ్బు ఉన్నపుడు ఎగిరి పడడం, లేనప్పుడు కుంగిపోవడం ధీరత్వం కాదు. అప్పులు చేయడం, ఆర్థిక చిక్కులతో ఆత్మహత్య చేసుకోవడం వీరత్వం కాదు.

ప్రాధాన్యాలను మరిచి విచక్షణా రహితంగా ఖర్చు చేయవద్దు. కనీస అవసరాలకు, విలాసాలకు మధ్య వ్యత్యాసం తెలుసుకోవాలి. మన పిల్లలకు పాఠశాల స్థాయి నుంచి కంప్యూటర్ లిటరసీ నేర్పినట్లే, ఆ చిన్నారులకు ఫైనాన్షియల్ లిటరసీ కూడా నేర్పాలి. ఆకర్షణీయ వేతనం అందించిన విద్యకు సరిసమానంగా ఆదాయాన్ని ఖర్చు చేసే ఆర్థిక అక్షరాస్యత కూడా అవసరమని తెలుసుకోవాలి. చాప ఉన్నంత వరకే కాళ్లు చాపుకోవాలన్నట్లు, ఆదాయ పరిమితులను గమనించి ఖర్చులను కుదించుకోవాలి.

అనారోగ్యాలు, ప్రమాదాలు చెప్పి రావు కాబట్టి రేపటి అత్యవసరాలను నేటి పొదుపు ఆదుకునే విధంగా ప్రణాళికలు వేసుకోవాలి. దీపం ఉన్నప్పుడే ఇళ్లు చక్క బెట్టుకున్నట్లు, డబ్బు ఉన్నపుడే ఆదా చేయడం నేర్చుకోవాలి.

### ప్రయోజనాలు

మన నెలసరి ఆదాయంలో కొంత మొత్తం పొదుపు చేయడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలుసుకోవాలి. ఆదా చేసిన వ్యక్తుల్లో ధైర్యం, మనశ్శాంతి, భయం తొలగడం, ప్రతికూల సమయాలను ఎదుర్కోగలగడమనే ధీమా, కుటుంబ సభ్యుల భద్రత, ఆనంద, ఆరోగ్యకర వాతావరణం, పిల్లలకు ఆర్థిక క్రమశిక్షణ అలవడడం, ఆస్తులను పెంచకపోవడం, పిల్లలకు ఉన్నత చదువులను అందించగలగడం.. లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. ప్రేమ పేరుతో/ఫాల్స్ ప్రిస్టేజ్ కోసం అంటూ పిల్లలు లేదా యువత అడిగినంతనే అధిక మొత్తంలో డబ్బును అందించడం వల్ల ఆ చిన్నారులకు/యువతకు విచ్చలవిడిగా ఖర్చు చేయడం దురలవాటుగా మారుతుంది. నేడు చేసిన పొదుపు రేపటికి భరోసాను అందిస్తుంది. కుటుంబ అవసరాలు, పిల్లల విద్యకు తగిన ఖర్చులకు వెనకాడకుండా కొంత సొమ్మును విధిగా పొదుపు చేయాలి. ఉద్యోగంలో చేరిన రోజే పదవి విరమణ తేదీ ఖరారు అవుతుంది కాబట్టి తొలి నాళ్ల నుంచే పొదుపు మార్గం ఎంచుకోవాలి.

### ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి

ఆర్థిక క్రమశిక్షణతో వృత్తిలో ఎదుగుదల, సాఫీగా వైవాహిక జీవితం కొనసాగడం, స్వంత ఇల్లు కల సాకారం కావడం, పిల్లలకు ఉన్నత విద్య అందించడం, ఊహించని ఖర్చులను తట్టుకోవడం, వాహనాలను కలిగి ఉండడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. తెలియకపోవడం తప్పు కాదు, తెలిసి పొదుపు చేయకపోవడం తప్పు.. అని గమనించాలి. ఆర్థిక క్రమశిక్షణ కొరవడిన కుటుంబాల్లో గొడవలు, అప్పుల బాధలు, అశాంతి, భవిష్యత్తు పట్ల అనిశ్చితి, మానసిక ఒత్తిడితో అనారోగ్యాలు, కుటుంబ పోషణలో ఇబ్బందులు, పిల్లల పెంపకంలో అవాంతరాలు లాంటి అవాంఛనీయ పరిస్థితులు ఎదురవుతాయి. మన పిల్లలకు విద్యతో పాటు మంచి అలవాట్లు, మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాసం, కనీస కంప్యూటర్ పరిజ్ఞానం, ఆర్థిక అక్షరాస్యత లాంటి అంశాలను తప్పనిసరిగా నేర్పించడం.. నేటి తల్లితండ్రులతో పాటు ఉపాధ్యాయుల బాధ్యత అని మరువరాదు. నాడు నగదుతో మాత్రమే జరిగిన క్రయ–విక్రయాలు నేటి యువత చేతుల్లో క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, ఆన్‌లైన్ చెల్లింపులు, ఈ వాణిజ్యాలు లాంటి సౌకర్యాలు కొన్ని సందర్భాల్లో ప్రమాదకర పరిస్థితులకు దారి తీయడం చూస్తున్నాం. నేటి యువత ఆర్థిక అక్షరాస్యత ప్రాధాన్యాన్ని తెలుసుకొని, పొదుపుకు ప్రాధాన్యమిస్తూ, ఖర్చులకు పరిమితులను ఏర్పరచుకొని ముందుకు సాగితే వారి భవిష్యత్తు సాఫీగా, ఆనందంగా కొనసాగుతుంది.

**- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి**

## గుబాళించే హ్యుమిడిఫయర్

చలికాలం వాతావరణంలో తేమ ఉండదు. దాంతో చర్మం పొడిబారిపోతుంది. అలా కాకుండా చేసే హ్యుమిడిఫయర్ అందుబాటులోకి వచ్చింది. ఇది పూల కూజాలా అందంగా ఉండే మోడల్‌లోను దొరుకుతుంది. పడుకునేటప్పుడు హ్యుమిడిఫయర్‌లో రెండు చుక్కల ఆరోమా నూనె వేసి ఆన్ చేసి పెట్టుకుంటే ఒత్తిడి తగ్గించి, రిలాక్స్ అయ్యేందుకు హాయి గొలిపే పరిమళాలను విడుదల చేస్తుంది.



అలాగే దీనిలోని ఎల్ఇడి లైట్ ఏడు రంగుల్లోకి మారుతుంది. అది కూడా కంటికి ఇబ్బంది కలిగించకుండా లేత రంగుల్లో కనిపిస్తుంది. చెక్కతో చేసిన ఈ ఫ్లవర్ ఉడ్ హ్యుమిడిఫయర్‌కి ఒక్కసారి ఛార్జింగ్ పెడితే ఎనిమిది గంటల పాటు పనిచేస్తుంది. ఇల్లూ, ఆఫీసు, కారూ ఎక్కడ అమర్చుకున్నా అందంగా కనిపిస్తుంది.

## వాయిస్ కంట్రోల్

వయసు పెరుగుతున్నకొద్దీ చూపు మందగిస్తుంది పెద్దవాళ్లకు. వాటిని అధిగమించడానికి అవసరానికి తగ్గట్లు కళ్లజోడును వాడుతుంటారు. సాదా అద్దాలకు బదులు చూపుతో పాటు మరెన్నో విధాలుగా సాయం చేయడానికి ఈ మధ్య ఎఐ టెక్నాలజీతో పనిచేసే గ్లాసెస్ వస్తున్నాయి. ఈ స్మార్ట్ కళ్లజోళ్లలో వాయిస్ కంట్రోల్, టచ్, బ్లూటూత్, హెల్త్ ట్రాకింగ్ ఫీచర్లెన్నో ఉంటాయి. వివిధ కంపెనీలు సీనియర్ సిటిజెన్స్ కోసం ప్రత్యేకంగా వీటిని తీసుకొస్తున్నాయి. వాటిల్లో ఎన్‌విజన్ గ్లాసెస్ ఒకటి. పత్రికలు, పుస్తకాలు, బిల్లుల్లాంటివి చదువుతున్నప్పుడు చిన్న అక్షరాలు మసగ్గా కనిపిస్తే వాటిని స్కాన్ చేసి గట్టిగా చదివి వినిపిస్తుంది. ఈ కళ్లజోడుతో ఫోన్ కూడా చేసుకోవచ్చు. కెమెరా, కలర్ సెన్సర్లు, ఆడియో, మైక్రోఫోన్స్‌తో ఉండే ఈ స్మార్ట్ కళ్లజోడు కచ్చితంగా పెద్దవాళ్లకు ఉపయోగకరమే.



ఏదైనా కళ్లజోడుకు అమర్చుకునేలా ఓర్‌క్యామ్‌రీడ్ స్మార్ట్ డివైజ్ వచ్చింది. ఎఐ సాంకేతికతతో పని చేసే ఈ పరికరం వాయిస్ కమాండ్ ఇస్తే మసగ్గా కనిపించేవాటి వివరాలన్నీ చెబుతుంది. మతిమరుపుతో ఇబ్బంది పడేవాళ్లను ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తూ, చేసే పనులను గుర్తుకు చేసే ఫీచర్లతో స్మార్ట్ ఎల్డర్ గ్లాసెస్ సైతం లభిస్తున్నాయి.





కథ

# ఉపాయశాలి

వజ్రగిరిని పాలించే రాజు కొడుకు వినయ వర్ధనుడికి పట్టాభిషేకం చేశాడు. మంత్రిగా నియమించబడిన విష్ణుశర్మ అంటే సేనాధిపతి జయకేతుకు ఇష్టం వుండేది కాదు. మంత్రి కున్నంత గౌరవం సేనాధిపతికి లేదు. ఇది ఇలా వుండగా కొత్త రాజు వచ్చాడు. అనుభవం తక్కువ.. అనుకుని వజ్రగిరి మీదకు దండయాత్రకు ఏర్పాట్లు చేయసాగాడు పొరుగు రాజు. ఈ విషయం తెలిసి వినయవర్ధనుడు మంత్రి విష్ణుశర్మని, సేనాధిపతి జయకేతుని పిలిచి, "పొరుగు రాజ్యంవాళ్ళు మన మీద దండెత్తాలని ప్రయత్నాలు ప్రారంభించారట. యుద్ధానికి మనం సిద్ధమేనా?" అన్నాడు. దానికి మంత్రి "ఇంత కాలం అణిగివుండి ఇప్పుడు దాడి చేస్తున్నాడంటే, కొత్త రాజును తక్కువగా అంచనా వేసి వుండాలి" అన్నాడు మంత్రి.

జయకేతు "మనం వారికి భయపడాల్సిన పనిలేదు. వారికి తగిన బుద్ధి చెప్పడానికి మన సైన్యం సిద్ధంగా వుంది" అన్నాడు. రాజుని మంత్రి మాటలు ఆలోచింపజేశాయి. అది గమనించి మంత్రి వేగులవాళ్లను పిలిచి "మీరు రహస్యంగా పక్క రాజ్యంలోకి వెళ్ళి వారి సైనిక బలానికి సంబంధించిన వివరాలన్నీ ఎలా అయినా తెలుసుకుని రండి" అన్నాడు.

వేగులవాళ్లు మారువేషాలలో పక్క రాజ్యంలోకి వెళ్ళి అక్కడి ప్రజలతో మాటలు కలిపి వారి సైనిక, అశ్వ, గజబలం వివరాలు తెలుసుకోసాగారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పొరుగు రాజుగారి చెవిన పడింది.

ఆయన రక్షకభటులతో "వేగులవాళ్లను బంధించి తీసుకరండి" అన్నాడు. రక్షకభటులు వెళ్ళి వేగులను బంధించి తీసుకొచ్చి రాజు ఎదుట నిలబెట్టారు "మా రాజ్యంలోనే గూఢచర్యం చేసి సైనిక వివరాలు సేకరిస్తున్నారు. దీనికి శిక్ష చాలా కఠినంగా వుంటుంది తెలుసా?" అన్నాడు.

"మీరు మా రాజ్యం మీదకు దండెత్తబోతున్నారని తెలిసింది. మేం సిద్ధంగా వుండడానికి మీ సైనిక వివరాలు తెలుసుకుందామని ప్రయత్నించాం. మా సైన్యంలో నాలుగో వంతు కూడా మీకు లేదు. మీ సైనిక వివరాలను మా రాజుకు ఇప్పటికే చేరవేశాం. మీరు మాకే శిక్ష వేసినా అనుభవించడానికి సిద్ధం" అన్నారు. వారి మాటలతో పొరుగురాజుకు భయం పట్టుకుంది. తాను పొరపాటు నిర్ణయం తీసుకున్నానా? అన్న ఆలోచన కలిగింది. ఆ మాటే తన మంత్రితో అన్నాడు. "యుద్ధం అంటే జయాపజయాల సంగతి అటుంచి ప్రాణ నష్టం, ఆస్థినష్టం తప్ప మిగిలేదేదీ వుండదు" అన్నాడు. మంత్రి మాటలతో పొరుగురాజు యుద్ధం ఆలోచన విరమించి పొరుగు రాజ్యంతో స్నేహాన్ని పెంచుకోవాలనుకున్నాడు. వేగులవాళ్ళను క్షమించి వదిలేశాడు. వేగులవాళ్ళతో నాటకం ఆడించి మంత్రి యుద్ధాన్ని తెలివిగా నివారించాడని వినయవర్ధనుడు తెలుసుకుని మంత్రిని ఘనంగా సన్మానించాడు.

మంత్రి ఎంతో ఉపాయశాలి అని గ్రహించాడు సేనాధిపతి జయకేతు. రాజ్యాన్ని రక్షించాలంటే కేవలం భుజబలమే సరిపోదు. దానికి బుద్ధిబలం కూడ తోడవ్వాలి. యుద్ధాన్ని ఉపాయంగా నివారించిన మంత్రి విష్ణుశర్మ కచ్చితంగా తన కంటే అధికుడేననుకుని అసూయా ద్వేషాలను వదిలి ఆ తరవాత కాలంలో మంత్రితో కలిసి మెలిసి పని చేస్తూ రాజ్యాభివృద్ధికి తోడ్పడ్డాడు సేనాధిపతి జయకేతు.

– డా॥ గంగిశెట్టి శివకుమార్





# బాలగేయం

## తరులు-గిరులు

కమ్మని కోయిల గీతం
ఝుమ్మనె తుమ్మెద సంగీతం.
విరిసే విరులే దరహాసం
మురిసే మనసే మధుమాసం.
కురిసే కరిమబ్బుల వరష్ట
మెరిసే తారాజువ్వల హర్షం.
మోగే మువ్వల నాదం
ఎగిరే గువ్వల ఆనందం.
కదిలే గోదావరి అందం
మదిదోచే దేవేరి బంధం.
తొలి పొద్దుల్లో సింధూరం
మలిపొద్దుల్లో బంగారం.
చిలుక పలుకే మాధుర్యం
కలికి కులుకే సౌందర్యం.
చుక్కల్లోని చక్కదనం
మొక్కల్లోని గొప్పదనం
తరులే కదా ఇల ఆదర్శం
గురులేగా మన మార్గదర్శం.

– గుండాల నరేంద్రబాబు



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

సి.పాండురంగ, కొడంగల్

**ప్రశ్న: టెలీ రేడియాలజీ అంటే ఏమిటి?**

**జవాబు:** రోగి శరీర భాగాలకు సంబంధించిన ఎక్స్-రేలు, సిటీ స్కాన్‌లు, ఎమ్ఆర్ఐలు మొదలైన రేడియాలజికల్ చిత్రాలను అధ్యయనం, సలహాల నిమిత్తం ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఒక చోట నుంచి మరో చోటుకు ప్రసారం చేయడమే టెలీ రేడియాలజీ. ఉదా: అమెరికా మొదలైన దేశాల నుంచి ఈ విధంగా వచ్చిన రేడియాలజికల్ చిత్రాలను మన దేశ నిపుణులు అధ్యయనం చేసి, తదుపరి అనుసరించవలసిన చికిత్సా పద్ధతులను వారికి తెలియజేస్తారు.

నివేదికలను అందుకొనే కేంద్రంలో ఒక వైద్యుడు కూర్చొని ఒకేసారి పలు ఆసుపత్రులకు సంబంధించిన కార్యకలాపాలను చక్కబెట్టవచ్చు. అమెరికాలోని ఆస్పత్రులలో రాత్రివేళ అత్యవసర సేవలు అందించడానికి అనువుగా మన దేశానికి భౌగోళిక పరమైన సానుకూలత ఉంది. వైద్య పరంగా ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉండటం, సుశిక్షితులైన వైద్యుల లభ్యత, నైపుణ్యం గల సిబ్బంది, తక్కువ జీవన వ్యయం మొదలైన అనుకూలతలు మన దేశానికి కలిసి వస్తుండటంతో టెలీ రేడియోలజీ బాగా విస్తరిస్తోంది.

# సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక 'బతుకమ్మ'

**బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సమిష్టి భక్తి భావానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచిన విశిష్టమైన ఉత్సవం. ప్రతి పండుగ పరంపరానుగతంగా విశిష్ట పద్ధతిలో జరుపుకునే ధార్మిక కార్యాచరణాసక్తుల నిలయమైన తెలంగాణలో సోదరీ మణులైన జేష్ఠాదేవి, లక్ష్మీదేవిలను కొలుస్తూ బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలను పక్షం రోజుల తేడాతో నిర్వహించడం సనాతన సంప్రదాయం.**

బతుకమ్మను పూలతో పేర్చి మధ్యలో పసుపు గౌరమ్మను ఉంచి ఆరాధించే విధానం శ్రీచక్ర ఉపాసనలోని మేరు ప్రస్థానం పోలికతో శక్తి ఆరాధనకు ప్రతీకగా కనిపిస్తుంది. తెలంగాణ స్త్రీలు గౌరమ్మను గౌరీ, లక్ష్మి, సరస్వతుల త్రిగుణాత్మక స్వరూపిణిగా భావించి పూజిస్తారు. "శ్రీలక్ష్మీ నీ మహిమలు గౌరమ్మా.." అంటూ గానం చేస్తూ ఆట-పాటలతో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు.

భాద్రపద అమావాస్య(మహాలయ అమావాస్య)నాడు 'ఎంగిలిపూల బతుకమ్మ'తో ఆరంభమై ఆశ్వయుజ శుద్ధ అష్టమి రోజున 'సద్దుల బతుకమ్మ'తో ముగిసే తొమ్మిది రోజుల ఉత్సవం తెలంగాణ స్త్రీల ఉత్సాహాన్ని, ఐకమత్యాన్ని ప్రతిబింబిస్తుంది. బతుకమ్మ తొమ్మిది రోజుల ఉత్సవం ప్రతిరోజు ఒక్కో ప్రత్యేకతతో జరుగుతుంది.

## తొమ్మిది రోజుల బతుకమ్మ

మొదటి రోజు **'ఎంగిలిపూల బతుకమ్మ'**. ఇది భాద్రపద అమావాస్యనాడు ప్రారంభమవుతుంది. ఈ రోజున నువ్వులు, బియ్యంపిండి, నూకలతో నైవేద్యం చేసి బతుకమ్మను పూజిస్తారు.





రెండవ రోజు ఆశ్వయుజ పాడ్యమి నాడు **'అటుకుల బతుకమ్మ'** జరుపుతారు. ఈ రోజున సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం చేస్తారు.

మూడవ రోజు ఆశ్వయుజ విదియనాడు **'ముద్దపప్పు బతుకమ్మ'** నిర్వహిస్తారు. పసుపు, కందిపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం చేస్తారు.

నాలుగవ రోజు ఆశ్వయుజ తృతీయనాడు **'నానబియ్యం బతుకమ్మ'** ఉంటుంది. నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లంతో బతుకమ్మకు నైవేద్యం సమర్పిస్తారు.

ఐదవ రోజు అంటే ఆశ్వయుజ చవితినాడు **'అట్ల బతుకమ్మ'** నిర్వహిస్తారు. ఈ రోజున అట్లు లేదా దోశలు నైవేద్యంగా సమర్పిస్తారు.

ఆరవ రోజు ఆశ్వయుజ పంచమి నాడు **'అలిగిన బతుకమ్మ'** జరుపుతారు. ఈరోజు నైవేద్యం సమర్పించరు, దీనిని ఆరామ దినంగా భావిస్తారు.

ఏడవ రోజు ఆశ్వయుజ షష్ఠినాడు **'వేపకాయల బతుకమ్మ'** ఉంటుంది. బియ్యప్పిండిని వేయించి వేప కాయలుగా చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.

ఎనిమిదవ రోజు ఆశ్వయుజ సప్తమి నాడు **'వెన్నముద్దల బతుకమ్మ'** నిర్వహిస్తారు. ఈ రోజున నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లంతో నైవేద్యం చేస్తారు.

తొమ్మిదవ రోజు ఆశ్వయుజ అష్టమి నాడు **'సద్దుల బతుకమ్మ'** ఘనంగా జరుగుతుంది. ఈ రోజున ఐదు రకాల నైవేద్యాలు తొమ్మిది రకాల సద్దులు(పులిహోర), పెసరపప్పు కూర, కందిపప్పు కూర, బెల్లం, తీపి వంటకాలు సమర్పిస్తారు. ఇదే రోజు దుర్గాష్టమి కావడంతో నియమ నిష్టలతో దుర్గాదేవిని ఆరాధిస్తారు.

గ్రామాల పొలిమేరలు, పంటచేలు, ఊరి చెరువులు.. అన్నీ బతుకమ్మ పూల సువాసనతో నిండిపోతాయి. తంగేడు, గునుగు, సీతమ్మవారిజడ, బంతి, చేమంతి, గన్నేరు, కట్ల, గోరింట, గుమ్మడి, మల్లె, మందారం మొదలైన పూలతో బతుకమ్మలను పేరుస్తారు.

తొమ్మిది రోజులూ పెద్ద బతుకమ్మతో పాటు మరో చిన్న బతుకమ్మను కూడా పేర్చటం సంప్రదాయం. సాయంత్రం వేళ కొత్త బట్టలు ధరించిన మహిళలు, పిల్లలు సమూహాలుగా చెరువుల వద్దకు చేరి వృత్తాకారంలో నిలబడి చప్పట్లు, గొబ్బి, కోలాటం.. ఆట-పాటలతో పూజిస్తారు.

ఆట-పాటలు పూర్తయిన తరువాత తాము తీసుకొచ్చిన నైవేద్యాలను సమర్పించి అనంతరం బతుకమ్మను జలాశయాలలో నిమజ్జనం చేస్తారు. తమతో పాటు తీసుకొచ్చిన నైవేద్యాలను ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుంటారు.

బతుకమ్మను ఆడే సమయంలో ఆలపించే పాటల్లో పంటలపై ఆశీర్వచనాలు, అన్నదమ్ములపై సోదరీ భావం, దేవతలపై భక్తి, సామాజిక సమస్యలపై చైతన్యం ప్రతిబింబిస్తాయి.

'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో' వంటి గీతాలు, 'రాత్రి వచ్చిన సాంబశివుడు ఎంతటి మాయలవాడే అమ్మా' వంటి పాటలు భక్తి భావాన్ని ప్రదర్శిస్తాయి. 'జనకు జనకునింటి ఉయ్యాలో' వంటి గీతాలు సీతాదేవిని స్మరిస్తాయి. 'కలవారి కోడలు కలికి కామాక్షి' వంటి పాటలు సామాజిక సమస్యలను ప్రస్తావిస్తాయి.

చారిత్రకంగా కూడా బతుకమ్మ పండుగ ప్రాధాన్యం గడించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించింది. 2016లో హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద లక్షలాది మహిళలు బతుకమ్మ ఆడగా రాష్ట్ర సంస్కృతి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిధ్వనించింది.



2017లో హైదరాబాద్‌లో జరిగిన బతుకమ్మ ఉత్సవం 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్'లో అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్న 'ఫోక్ డాన్స్'గా నమోదైంది. 2022లో యునెస్కో వారసత్వ జాబితాలో బతుకమ్మను చేర్చాలని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సిఫారసు చేయగా ఆ ప్రక్రియ కొనసాగుతోంది.

ప్రపంచ వ్యాప్తంగా అమెరికా, ఇంగ్లాండ్, దుబాయ్, సింగపూర్ వంటి దేశాల్లో ఉన్న తెలంగాణ వాసులు కూడా బతుకమ్మను ఘనంగా జరుపుకుంటున్నారు. 2023లో డల్లాస్‌లో జరిగిన బతుకమ్మ ఉత్సవంలో 25 వేలమంది మహిళలు పాల్గొన్నారు. 2024లో తెలంగాణ వ్యాప్తంగా 1.25 కోట్ల మంది మహిళలు తొమ్మిది రోజుల బతుకమ్మలో పాల్గొన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఈ సమిష్టి ఉత్సవం మహిళల ఆత్మ గౌరవానికి ప్రతీక. ప్రకృతి ఆరాధన, కుటుంబ బంధాల బలోపేతం, సామాజిక ఐక్యత, సాంప్రదాయ వారసత్వ పరిరక్షణ బతుకమ్మ ద్వారా బలపడుతున్నాయి. బతుకమ్మ కేవలం పూల ఆట మాత్రమే కాదు.. అది తెలంగాణ ఆడవారి ఆత్మగౌరవం, శక్తి స్వరూపిణి స్మరణ, సాంస్కృతిక వారసత్వానికి సజీవ రూపం.

**- రామకిష్టయ్య సంగనభట్ల**



## కిలో కోటి రూపాయలా?

ఖరీదైన వస్తువులు అనగానే మనకు ఠక్కున బంగారం, ప్లాటినం, వజ్రాలు, ప్యూర్ టేక్‌వుడ్ మొదలైనవి స్ఫురిస్తాయి. వాటన్నింటికంటే అత్యంత ఖరీదైనవి ప్రపంచంలో వున్నాయంటే ఆశ్చర్యం వేస్తుంది. అలాంటిదే ఇది. అత్యంత ఖరీదైన కలపలో అగర్వుడ్ ఒకటి. దీనిని అలోస్వుడ్, ఈగిల్వుడ్ అని కూడా అంటారు. పెర్ఫ్యూమ్ పరిశ్రమలో బాగా ప్రసిద్ధి చెందింది. దీని తయారీకి సుమారు పదిహేను నుండి ఇరవై సంవత్సరాలు పడుతుంది. ఇది చాలా అరుదైన, ఖరీదైనదిగా పేరు పొందింది. ఆసియాలోని అక్విలేరియా వృక్షాల నుండి వస్తుంది. ఈ చెట్లు ఫంగస్ బారిన పడినప్పుడు జిగురు లాంటి పదార్థం ఉత్పత్తి చేస్తాయి. ఈ విధంగా సేకరించిన నూనెను లగ్జరీ పెర్ఫ్యూమ్‌లలో ఉపయోగిస్తారు. ఒక కిలో ధర కోటి రూపాయల పైనే ఉంటుందట అంటే ఒక గ్రాము ధర లక్షకు పైనే అన్నమాట. అగర్వుడ్ సువాసనకు మాత్రమే కాదు, ఆధ్యాత్మికంగానూ పేరు గాంచింది. దీనిని ఆయుర్వేదంలోనూ ఉపయోగిస్తారు. మలేషియా, థాయిలాండ్ మొదలైన ప్రాంతాల్లో అరుదుగా కనిపిస్తుంది. సంపన్న వర్గాలు, రాజవంశాలు తమ సంప్రదాయంలో ఈ పెర్ఫ్యూమ్‌ను ఉపయోగిస్తారు.

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

కథ

# కొత్త చిగురు

**పంతంగి శ్రీనివాసరావు**

గత కొన్ని రోజుల నుంచి పూర్ణి కంటిచమ్మ ఆరటం లేదు. భర్త టార్చర్ రోజు రోజుకూ శృతి మించుతోంది. అతనితో కలిసి ఉండటం ఇక తన వల్ల కావడం లేదు.ఆరేళ్ల కొడుకు వినీత్‌ను చూస్తోంటే గుండె తరుక్కుపోతోంది. తండ్రి ప్రేమకు దాదాపు దూరం అయ్యాడు అతను.

భర్త ప్రతి రోజు తాగి వస్తాడు. అడిగితే బెల్ట్ తీస్తాడు. ఒంటి మీద వాతలు తేలేట్టు కొడతాడు. అర్ధరాత్రి తను కేకలు వేస్తే ఆ చప్పుడుకి వినీత్ లేస్తాడని, తల్లిపడి ఆ చిత్రహింసలు చూసి, ఆ పసివాని మనస్సు ఆక్రోశిస్తుందనీ, వాడి మీద తన ప్రభావం చూపుతుందని తాను ఉగ్గ పట్టుకుంటోంది, రెండు పెదవులను బిగించి.

పూర్ణిమ పుట్టింట ఎంతో సుకుమారంగా పెరిగింది. తండ్రి వ్యాపారంలో బాగా సంపాదించాడు. తనొక్కతే తల్లిదండ్రుల సంతానం. అందుకే ఎంతో గారాటం చూపారు. డిగ్రీ వరకు చదివించారు.

ఒక్కసారిగా ఆమెలో ఏవేవో జ్ఞాపకాల పొరలు.

.........

'అరవింద్'.. పూర్ణిమ ఇంటికి దగ్గరలోనే వారిల్లు, ప్రతిరోజు పూర్ణిమను గమనించేవాడు అతను. ఆమె మీద అలవిమాలిన అభిమానం పెంచుకున్నాడు.

ఒకరోజు తన ఇంటి మీదుగా వెళ్తోన్న పూర్ణిమను బైక్ మీద స్లోగా ఫాలో అయ్యాడు. కాలేజీ దగ్గరనే కనుక, ఆమె నడిచే వెళ్తుంది. తన వెనుక ఫాలో అవుతున్న అరవింద్‌ను గమనించి ఒక్కసారిగా వెనక్కు తిరిగి చూసింది. అతను తత్తర పడ్డాడు. ఆమె కళ్ళల్లో బెరుకు. అతను ఆగిపోయాడు.

మరొకరోజు.. పూర్ణిమ కాలేజీకి బయలుదేరక ముందే మలుపు వద్ద కాపు కాశాడు. దగ్గరకు వచ్చిన పూర్ణిమకు అడ్డు తగిలి "హాయ్.." అంటూ ఎంతో ధైర్యంగా పలకరించాడు.

తనూ చిరునవ్వు నవ్వింది ప్రతిగా.. అంతకు మించి తనకు ఏమీ తోచలేదు.

"ఏ గ్రూప్.." అడిగాడు.

చెప్పింది.

అలా మొదలైంది పరిచయం వారిద్దరి మధ్య.

అరవింద్ తను 'లా' చదువుతున్నట్టు చెప్పాడు.

ఒకరోజు అడిగాడు ఎంతో చనువుగా "నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అని.


పూర్ణిమలో కొద్దిగా తత్తరపాటు.

"నువ్వు అంగీకరిస్తే మా డాడీని పంపుతాను మీ ఇంటికి" చెప్పాడు.

"మన కులం..!"

"మాకు అభ్యంతరం లేదు. మేం అభ్యుదయ వాదులం.. మా పూర్వీకుల నుంచే మాది కమ్యూనిజం భావజాలం..."

"మా నాన్న ఒప్పుకోకపోవచ్చు. ఎందుకంటే ఆయన సనాతన వాది. నేను ఒక్కగానొక్క కూతురిని, ఆయనకు కొన్ని అభిప్రాయాలు ఉంటాయి..."



"మరి నాతో ఎందుకు ఇంతగా పరిచయం పెంచుకున్నావు. నాలో ఎందుకు ఇన్ని ఆశలు రేపావు.." సూటిగా అడిగాడు అరవింద్.

"సారీ.. నేను అంత దూరం ఆలోచించలేదు. కేవలం ఫ్రెండ్‌షిప్‌గానే భావించాను. కాలక్రమేణా అది నువ్వంటే నాకు ఇష్టంగా మారింది. అయితే, నీతో మాత్రం శాశ్వతంగా ఉండేంత సాహసం మాత్రం చేయలేను.." ఆమె కూడా నిక్కచ్చిగానే తప్పింది.

"పూర్ణిమా.. నాకు నువ్వు తొలి పరిచయానివి. నిన్ను తప్ప నా భాగస్వామి స్థానంలో ఎవరినీ ఊహించలేను.."

"నిజమే.. అయితే, నేను మాత్రం మా పేరెంట్స్ అంగీకారం లేకుండా ఏమీ చేయలేను.."

"మీ ఆడవాళ్ళు ఎలాగైనా సమాధాన పడతారు. అది మీకు దేవుడిచ్చిన వరం.

ఎనీహౌ.. నీ భావి జీవితం సుఖప్రదంగా ఉండాలని భావిస్తున్నాను..” అతని కళ్ళల్లో నిర్వేదం.

...............

“ఇతని పేరు ప్రదీప్.. ప్రభుత్వ ఉద్యోగి, మంచి సాలరీ. నువ్వు సుఖపడతావు. నిశ్చింతగా ఉండొచ్చు..” ఒక ఫోటోను చూపించి చెప్పాడు తండ్రి పూర్ణిమకు.

ఆయనే చెప్పాడు మరలా “ఇతనికి ఆస్తిపాస్తులు లేకపోవచ్చు. అయితేనేం, గౌరవ ప్రదమైన ఉద్యోగం ఉంది. ఈ సంబంధాన్ని మా ఫ్రెండ్ ఒకతను తెచ్చాడు. దురదృష్టవశాత్తు తల్లిదండ్రులను యాక్సిడెంట్‌లో కోల్పోయాడు. నా స్వార్థం ఏమిటంటే, అతను నాకు అల్లుడిగానే కాకుండా కొడుకుగా కూడా ఉంటాడని... ”

అభ్యంతరం చెప్పలేదు పూర్ణిమ.

ఒక శుభ ముహూర్తంలో పూర్ణిమ వివాహం ప్రదీప్‌తో జరిగింది.

వివాహమైన కొత్తలో ఎంతో అన్యోన్యంగా సాగింది వారి సంసార జీవితం. వారి అనురాగానికి చిహ్నంగా వినీత్.

కాలచక్రంలో అనుకోని మార్పులు.

లంచం తీసుకుంటూ ఏసిబికి దొరికాడు ప్రదీప్. ఫలితంగా సస్పెండ్ అయ్యాడు.

ఈ పరిణామం పూర్ణిమ తండ్రిని కుంగతీసింది. ఆపద మీద ఆపద వచ్చినట్లు ఆర్థికమాంద్యం ఆయన వ్యాపారాలను దిబ్బ తీసింది. పార్టనర్స్ మోసం చేశారు. ఫలితంగా అప్పులు. ఉన్న ఇంటిని అమ్మవలసి వచ్చింది. అవమానాన్ని భరించలేక ఒక దుర్దినాన ఆత్మహత్య చేసుకున్నాడు.

అగాథంలోకి కూరుకుపోయింది పూర్ణిమ జీవితం.

ఉద్యోగాన్ని కోల్పోయిన ప్రదీప్ తాగుడుకు బానిస అయ్యాడు. పూర్ణిమ బంగారానికి రెక్కలొచ్చాయి. ఇంటి కిరాయి కూడా చెల్లించడం గగనం అయిపోయింది.

అప్పుడు బయట పడింది ప్రదీప్ స్వరూపం.

అతని శాడిజం పరాకాష్టకు చేరుకుంది.

ఇక తనకు చావున పరిష్కారం అనుకుంది పూర్ణిమ. అయితే కొడుకు గుర్తుకు వచ్చి సమాధానపడింది.

ఒకరోజు బ్యాగు వేసుకుని స్కూల్‌కు వెళ్లిన వినీత్ గంటలో తిరిగి వచ్చాడు. రెండు నెలల నుంచి ఫీజు కట్టనందుకు అతడిని స్కూల్ నుంచి ఇంటికి పంపారు.

ఓ రోజు మార్కెట్‌లో అనుకోకుండా కలిశాడు అరవింద్, పూర్ణిమకు పక్కనే భర్త ప్రదీప్. అరవింద్‌ను పలకరిద్దాం.. అనుకుంటే అసలే అనుమాన పురుగు. తనను చూసి చిరునవ్వు నవ్విన అరవింద్‌కు జీవం లేని నవ్వుతో సమాధానం ఇచ్చింది. పక్కకు వచ్చిన అరవింద్ ప్రదీప్ చూడకుండా ఒక కార్డ్‌ను అందించాడు పూర్ణిమకు. ఆ కార్డ్‌ను తన హాండ్ బ్యాగ్‌లో వేసుకుంది.

ఇప్పుడు దాని అవసరం వచ్చింది. భర్త బయటకు వెళ్లాక ఆ కార్డ్ చూసింది..

‘అరవింద్, అడ్వకేట్’. ఇక ఆలస్యం చేయలేదు పూర్ణిమ.

ఫోన్ కలిపింది.

“అరవింద్ గారేనా?”

“ఎస్... నేనే మాట్లాడుతున్నాను” జవాబు.

“నేను... నేను.. పూర్ణిమ..”

“పూర్ణిమా.. ఎలా ఉన్నావ్? బాగున్నావా?”

మౌనమే సమాధానం.. ఆమెకు ఏడుపు తన్నుకు వస్తోంది.

**“నింపాదిగా చెప్పు పూర్ణిమా.. నా వలన ఏ సహాయం కావలిసినా చేస్తాను....” బేలగా చూస్తోన్న ఆమెను గమనిస్తుంటే అతనిలో ఏవేవో ఆలోచనలు. అప్పుడు నోరు విప్పింది పూర్ణిమ.. ఎంతో ధైర్యంగా..**

“పూర్ణిమా.. వాట్ హేపెండ్! ఏమయింది?”

అతని కంఠంలో ఆదుర్దా..

“నేను.. నేను.. మిమ్మల్ని కలవొచ్చా?”

“ష్యూర్.. ఏమిటి కొత్తగా.. మీరు!”

“అరవింద్.. ఈ సాయంత్రం రావొచ్చా?”

“సాయంత్రం ఐదు వరకు వచ్చేయ్.. నేను అప్పుడు కోర్టు నుంచి వస్తాను..” అతని మాటల్లో ఆనందం తొంగి చూస్తోంది.

..........

సాయంత్రం ఐదున్నర.

వినీత్‌ను వెంటబెట్టుకుని కార్డ్‌లో ఉన్న చిరునామా ప్రకారం అరవింద్ ఆఫీసుకు చేరుకుంది పూర్ణిమ.

అప్పటికి అక్కడ కొంతమంది క్లైంట్స్ ఉన్నారు. ఆఫీస్ బోయ్‌కు ఒక స్లిప్‌లో తన పేరు రాసి ఇచ్చింది.

కొద్దిసేపట్లోనే ఆమెకు పిలుపు వచ్చింది.

చాంబర్‌లో తన సీట్లో కూర్చుని ఉన్న అరవింద్ పూర్ణిమకు ఎదుటి సీటు చూపించాడు కూర్చోమని.

“మీ బాబు చాలా క్యూట్ గా ఉన్నాడు. అచ్చు నీ పోలికే..” అభిప్రాయం చెప్పాడు వినీత్ గురించి.

కొద్దిసేపు నిశ్శబ్దం.. తర్వాత అతనే మాటలు కదిపాడు..

“చాలా రోజులు అయింది పూర్ణిమా నిన్ను చూసి.. అసలు ఇక నీవు కలవవు అనుకున్నాను..” చెప్పాడు.

అప్పటివరకు తల వంచుకుని కూర్చున్న ఆమె అప్పుడు తల ఎత్తింది. ఆమె కళ్ళనిండా నీళ్ళు.

అరవింద్ లేచి ఆమె పక్కకు వచ్చి.. “పూర్ణిమా.. ఏమిటి ఏం జరిగింది? చెప్పు.. రిలాక్స్..” అడిగాడతను ఎంతో ఆత్రంగా.

బ్లాస్ట్ అయింది ఆమె.

కొద్దిసేపు తెరిపిన పదనిచ్చి అడిగాడు మరలా. “నింపాదిగా చెప్పు పూర్ణిమా.. నా వలన ఏ సహాయం కావల్సినా చేస్తాను” బేలగా చూస్తోన్న ఆమెను

గమనిస్తుంటే అతనిలో ఏవేవో ఆలోచనలు.

అప్పుడు నోరు విప్పింది పూర్ణిమ.. ఎంతో ధైర్యంగా.. చనువుగా...

అంతా విన్నాక అతడు అడిగాడు. "నువ్వు నన్ను విశ్వసిస్తే నేను చెప్పినట్లు చేస్తావా?" అడిగాడు.



తల ఊపింది అంగీకారంగా. అంతకు మించి ఆమెకు మరో మార్గం లేకపోయింది. ప్రదీప్ నుంచి తనకు విముక్తి కావాలి. వచ్చేప్పుడు అడిగింది పూర్ణిమ. "అరవింద్.. మీ శ్రీమతి బాగున్నారా?" అని.

"నిజం చెప్తున్నా పూర్ణిమా.. స్టిల్ ఐ యాం బ్యాచ్‌లర్.." చెప్పాడు.

కళ్ళు వెడల్పయ్యాయి ఆమెకు. "అదేమిటి?"

"అదంతే.. మనస్సును చంపుకుని పెళ్ళి చేసుకోవాలని అనిపించలేదు నాకు"

సూటిగా తగిలింది ఆ మాట ఆమెకు.

అప్పటి నుంచీ ప్రదీప్ లేని సమయాల్లో ఫోన్లు చేస్తూనే ఉంది పూర్ణిమ. ఆమెకు ఎంతో ఉపశాంతి కలుగుతోంది అరవింద్‌తో మాట్లాడుతుంటే.. వినీత్ ఫీజును అరవిందే చెల్లించాడు. ఆమె అభ్యంతరం చెప్పలేదు.

........

ఆ రోజు.. డైవోర్స్ పేపర్స్ సర్వ్ అవుతాయని తెలుసుకున్న రోజే గడప దాటింది పూర్ణిమ వినీత్ చేయి పట్టుకుని. అరవిందే చాలా దూరంలో ఆమెకు ఒక ఫ్లాట్ చూసి పెట్టాడు. ప్రదీప్‌కు ఆమె చిరునామా దొరకకూడదు. అందుకే ఆమె సెల్ సిమ్ కూడా మార్చాడు.

డైవోర్స్ పేపర్స్ అందుకున్న ప్రదీప్ శివాలు ఎత్తుతాడని ఆమెకు తెలుసు. అది తనకు అనవసరం అనుకుంది మొండిగా పూర్ణిమ. జీవితం మీద తిరిగి ఆశలు కలిగించాడు అరవింద్,

ఒకరోజు అడిగాడు అరవింద్ "నీకు చట్ట ప్రకారం డైవోర్స్ వచ్చాక నా ఫీజు చెల్లించాలి.." అని.

ప్రక్కనే ఉన్న వినీత్ తలను నిమురుతూ నవ్వుతూ చూస్తుండిపోయింది పూర్ణిమ. మరలా చనువు పెరుగుతోంది వారిద్దరి మధ్య.

.......

ఒకరోజు అరవింద్ ఫోన్‌లో హఠాత్తుగా "పూర్ణిమా! ఉస్మానియా మార్చురీకి వస్తావా?" అని అడిగాడు.

"ఎందుకు అరవింద్?" ఆమెకు అర్ధం కాలేదు.

"సారీ పూర్ణిమా, ప్రదీప్‌కు రోడ్డు ఆక్సిడెంట్.. బాగా తాగి.."

ఆమెలో ఏ విధమైన ఫీలింగ్స్ లేవు. "నేను రాను.. రాలేను అరవింద్.. అతనితో నాకు ఏ విధమైన సంబంధాలు లేవు.." "మరి అంతిమ కార్యక్రమాలు...!"

"అతడిని అనాథ శవం కింద ట్రీట్ చేస్తారు..అంతే"

"సరే.. నీ ఇష్టం.. ఆ సమయంలో అతని వద్ద దొరికిన డైవోర్స్ పేపర్స్‌లో నీ అడ్వకేట్‌గా నా పేరు చూసి పోలీసులు నాకు ఇన్‌ఫామ్ చేసారు. అందుకే ఈ విషయం నాకు తెలిసింది.. కూల్ డౌన్...పూర్ణిమా"

తేలికగా శ్వాస తీసుకుంది పూర్ణిమ.

..........

అరవింద్ తన పలుకుబడితో పూర్ణిమకు ఓ ప్రైవేట్ సంస్థలో జాబ్ ఇప్పించాడు.

తనకు అరవింద్ మరలా కలవకపోతే, అతడు తనకు ఏ విధమైన సహాయం చేయకపోతే, తన పరిస్థితి..? ఎందుకు అతని మీద అలవిమాలిన అభిమానం పెరుగుతోంది పూర్ణిమకు,

ఒకరోజు సాయంత్రం కోర్టు నుంచి డైరెక్ట్‌గా పూర్ణిను ఇంటికి వచ్చాడు అరవింద్.

వినీత్‌కు-అరవింద్‌కు చనువు బాగా పెరిగింది. అరవిందే ఆ విధమైన చొరవ తీసుకున్నాడు.

వినీత్ టెన్త్ క్లాస్‌లోకి వచ్చాడు. అతనికి అంతా అర్థమైంది. తన తండ్రి, తన తల్లిని ఏ విధంగా బాధ పెట్టాడో.. తన తల్లి, తన కలలన్నీ తన మీదనే పెట్టుకుని ఎలా జీవిస్తుందో.. అంతా అవగతం అవుతోంది వినీత్‌కు.

టీ కప్పు టీపాయ్ మీద పెడుతూ అడిగాడు అరవింద్ "పూర్ణిమా.. నా ఫీజు సంగతి!"

"ఎంత ఇవ్వమంటావ్..?"

"అసలు విషయానికి వస్తున్నాను పూర్ణిమా.. మనం పాత పరిచయంలో ఎలా ఉండేవాళ్ళం.. అందుకే అప్పటి ప్రేమను ఇప్పుడు చిగురింపచేసుకుందాం.. ఏమంటావ్?" అడిగాడు.

"బాగా ఆలోచించావా అరవింద్.. నాకు ఒక కొడుకు ఉన్నాడు.."

అక్కడే ఉన్న వినీత్‌ను దగ్గరకు తీసుకుని అడిగాడు అరవింద్ "వినీత్.. రేపు నువ్వు పై చదువుల కోసం దూర ప్రాంతానికి వెళ్ళిపోతావ్. ఆ తర్వాత నీకు పెళ్ళి అవుతుంది. నీ జీవితం నీది.. మీ నాన్న నీకు ఒక పీడకల. అది గతం.. మరి మీ అమ్మకు తోడూ..నీడా..!"

వినీత్ కళ్ళల్లో నీటి చెమ్మ. అతనిలో అంతులేని ఆలోచనల మథనం. ఆ ఆలోచనల మధ్యనే అతనో నిర్ణయం తీసుకున్నాడు. తన తల్లికి తన అభిప్రాయాన్ని వెల్లడించడానికి ఏ మాత్రమూ ఆలస్యం చేయలేదు వినీత్.

........

"మమ్మీ.. గుడ్ మార్నింగ్.."

వినీత్ ఎలా ఉన్నావ్‌రా"

ఎంఎస్ చేయడానికి యూఎస్ వెళ్లిన వినీత్ వీడియో కాల్ ద్వారా మాట్లాడుతున్నాడు "మమ్మీ.. మెనీ మెనీ రిటర్న్స్ ఆఫ్ ది డే".. నీకూ.. డాడీకి.. కూడా.."

అప్పుడే బయటకు వచ్చాడు అరవింద్.

"హాయ్ వినీత్.. హౌ ఆర్ యు.." పలకరించాడు.

"ఫైన్ డాడీ.. మీకు కూడా మెనీ మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే.."

"ఓ..! ఈ రోజు మన పెళ్లిరోజు కదూ..." చిలిపిగా చూసాడు అరవింద్ పూర్ణిమ వేపు..

ఇంతలోనే కొరియర్ బోయ్ ఒక పార్సిల్ తెచ్చాడు. అది వినీత్ పంపిన కేక్.

# సెల్‌ఫోన్‌తో సమానంగా పుస్తకాన్ని ప్రేమించాలి

అమ్మ, నాన్న సాయంతో అడుగులు వేయటం నేర్చుకొన్న బాల్యంలో అక్షరాలు, గుణింతాలతో పుస్తకం పట్టడం అనే అభ్యాసం చదువుకోవటానికి శ్రీకారం చుట్టేది. ప్రస్తుతం పిల్లల చేత పుస్తకం కాకుండా సెల్‌ఫోన్‌లు పట్టించే సంస్కృతి ప్రవేశించింది.

అక్షరం అంటే అకారాది వర్ణంతో పాటు ఓంకారం, నాశనం లేని ధర్మం అనే అర్థం కూడా ఉంది. అక్షరాభ్యాసం మొట్టమొదటిసారి పిల్లలతో అక్షరాలు దిద్దించడం. కానీ సెల్‌ఫోన్‌లు పిల్లల చేతికి ఇవ్వటంతో చదువు స్వరూప స్వభావాలు పూర్తిగా మారిపోయాయి.

'పుస్తకం పట్టడం' అనే చదువుకొనే క్రమంలోని ఆరంభం, ప్రస్తుత విద్యా విధానానికి అవసరం లేదు. పిల్లల ఒడిలో ల్యాప్‌టాప్‌లు, చేత సెల్‌ఫోన్‌లు పుస్తకం కనుమరుగయ్యే రోజులు శరవేగంగా సంక్రమింపచేస్తున్నాయి. పాఠ్యపుస్తకాలు కూడా క్రమేపీ అవసరంలేని విద్యావ్యవస్థ అడుగు పెట్టింది. కొత్త తరానికి చదివే ఆసక్తి కలిగించటానికి పుస్తకం చేతో్త పట్టుకొని 'పుస్తకంతో నడక' ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవ సందర్భంలో నిర్వర్తించవలసిన అగత్యం సమాజం ఎదుర్కొంటోంది.

"చిరిగిన చొక్కా తొడుక్కున్నా సరే ఫరవాలేదు. పుస్తకం కొనుక్కో" అనే సందేశ నినాదంలో ఎంతో అర్థం వుంది. చిన్నతనం నుండే పుస్తకాలు చదవాలనే ఆలోచన కలిగిన తరం కరిగిపోతోంది. ఆ తల్లిదండ్రులు వయోవృద్ధులు వెళ్లిపోతున్నారు. చిరిగిన చొక్కా తొడుక్కోవలసిన అవసరం లేని ఈ రోజులలో పుస్తకం చదవాలనే పఠనాసక్తి తగ్గిపోతుంటే యిక కొనటం ప్రశ్న ఎక్కడ? పాలకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ర్యాంకులు, మార్కులు, ఉద్యోగ-ఉపాధి అవకాశాలలో లక్షలు దాటి కోట్లు సంపాదించాలనే సహజ లాలసతో సమాజం కొట్టుమిట్టాడుతోంది.

పుస్తకాలు చదవడం అంటే సమయం వృథా చేసుకోవడం అనే భావన సర్వత్రా అంకురిస్తోంది.

మరొక ముఖ్య విషయం.. పిల్లలు పుస్తకం చదవాలంటే అక్షర జ్ఞానంతో, చదవటం నేర్పాలి. చూసి నేర్చుకోవటం మంచిదే. కానీ చదివి నేర్చుకోవటం వలన మరింత మనస్సుకు పని పడ్తుంది. ఎదుగుదలకి త్వరితంగా తోడ్పడుతుంది. నిత్య జీవితంలో పుస్తకాలను కూడా సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లతో సరిసమానంగా ఆదరించాలి. ముందుగా అమ్మ పలుకులో కేవలం మాట్లాడటమే కాకుండా, బడిలో తెలుగు చదవటం నేర్పించాలి. తల్లిభాషతో పుస్తక పఠనం విద్యా విధానంలో కీలకం అయితే పుస్తకం బడిపలుకుగా ఆదరించబడుతుంది. అది పసివయసు నుంచే ఆరంభం కావాలి.

విద్యాలయాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి తప్పనిసరిగా బాలబాలికలు పుస్తకాలు చదివే వాతావరణం నెలకొల్పాలి. సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లు వదలకుండానే, పుస్తకాలు కూడా పట్టించాలి. పుస్తకాన్ని యువతీ యువకులే, భవిష్యత్ తరమే బతికించగలుగుతుంది. కాబట్టి, ప్రస్తుతం ప్రపంచం సాధిస్తున్న సాంకేతిక జ్ఞానం సాధ్యమైనంత పుస్తకాల రూపంలో విలసిల్లే ఆలోచనలతో రచనలు ఆదరించబడాలి. సర్వత్రా పుస్తకం వెల్లివిరియాలి.

21వ శతాబ్దం తృతీయ దశాబ్దంలోకి ప్రవేశిస్తున్న ప్రస్తుత సమాజంలో మన తల్లిపలుకు తెలుగు గురించి, కరదీపాల వంటి పుస్తకాల గురించి భావాత్మక ప్రాధాన్యతతో ఆలోచించాలి. తెలుగులో రెండు రాష్ట్రాలలో రచయితలు, కవులు, పుస్తక ప్రియులు, ప్రచురణకర్తలు, విక్రేతలు, గ్రంథాలయ అధికారులు, విద్యార్థులు, అధ్యాపకులు కోకొల్లలుగా ఉన్నారు. వారందరికీ, పుస్తక శక్తి తెలుసు. జీవన గతిని పుస్తకాలు మార్చగలిగిన అనుభవాలు ఉన్నాయి. పాఠ్య పుస్తకాలే కాకుండా సామాజిక, సాహిత్య చారిత్రక, కాల్పనిక ఆలోచనలను రేకెత్తించే రచనలతో యువతరాన్ని ఆకట్టుకోవాలి.



ప్రస్తుతం వినోద ప్రధానంగా, పర్యాటక, ఆధ్యాత్మికత లక్ష్యంగా నడుస్తున్న భారతీయ సమాజంలో అవలక్షణాలు శృతి మించే సామాజిక న్యాయం ప్రబలి జన జీవనం కొంత సంక్షోభంలో చిక్కుకుంటోంది. ఆర్థిక అసమానతలు, అంతరాలు లేకుండా సామాజిక న్యాయం, సంక్షేమం సమానతకు ప్రాధాన్యం యిచ్చే రాజకీయ నాయకులు భవిష్యత్ తరాలను తీర్చిదిద్దగలిగే విద్యాలయాలలో, చదివి ఆలోచించే పుస్తక సామర్థ్యాన్ని చిత్తశుద్ధితో ఆచరింపచేయాలి.

**- జయసూర్య**

# అమ్మ

అమ్మ అంటే ఒక్కరే అమ్మ. మీ అమ్మ, మా అమ్మ అంటూ వేర్వేరు అమ్మలు ఉండరు. ఒకే అమ్మ.. అమ్మ నిన్న మళ్ళీ కలలోకొచ్చింది. దట్టమైన పొగమంచుని తొలుచుకుంటూ నెమ్మదిగా బయటికొస్తున్న సూర్యుణ్ణి చూడమన్నట్లు అమ్మ చేతులు సైగలు చేస్తూ కనిపించాయి. సరే కదాని అడుగులు వేస్తుంటే అమ్మ వేలు పట్టుకుని మరీ సూర్యుణ్ణి చూద్దామనుకుంటే అమ్మ కనిపించలేదు. రెప్పపాటు కాలంలో అమ్మ ఎందుకు కనిపించకుండా దాక్కుందేమిటీ? ఈ దాగుడుమూతల ఆటలో అమ్మకు ఏమానందమో? అయినా అమ్మల కళ్ళకు ఎంత వయసొచ్చినా పిల్లలు పసిపిల్లలే.

ఇప్పుడు అమ్మ తరచూ కలలోకొస్తోంది. తలపులలో ఉంటూనే ఉంది. ఎప్పట్లాగానే నిన్నటి కలలోనూ అమ్మ ఏమీ మాట్లాడలేదు. ఓ చిరునవ్వు. ఒకే ఒక్క చిరునవ్వు. గాలి బలమైనదైనా వేగమైనదైనా సరే తట్టుకుని నిల్చుని అటూ ఇటూ ఊగుతూ నన్నేమీ చెయ్యలేవని నవ్వే పువ్వులాంటి నవ్వు అమ్మ నవ్వు.

ఆ నవ్వు మాటలకూ, వాక్యాలకూ అతీతం.

గర్భగుడిలో అమ్మవారి నవ్వులాంటి నవ్వది!

ఎప్పటికి హృదయంలో ఉండిపోయిన నవ్వది. ఆ నవ్వు ఓ భరోసా! ఓ ధైర్యం! ఓ అందం! ఓ ఆనందం!

అమ్మ దాక్కుందని నేనేమీ వెనక్కు తగ్గలేదు. అమ్మ కనిపించిన దిశలోనే నడిచాను. అమ్మ వేలు మరొక్క క్షణంలో అందుకోగలనన్న తరుణంలో కల చెదరిపోయింది. కళ్ళు తెరిచాను. నిద్ర పట్టలేదు. సెల్ ఫోన్ తీసాను. టైమ్ చూశాను. ఉదయించడానికి ఇంకో గంటన్నరపైనే ఉంది.

పక్కన భార్య పడుకునే ఉంది. కొడుకు మరొక గదిలో పడుకున్నాడు.

బాల్కనీలోకొచ్చాను. మర్రి చెట్టు ఊడల్లా బంధువులెందరు ఉంటేనేం? అన్ని బంధాలకూ మూలమైన వేరువై ఉన్నది నువ్వే కదమ్మా! అందుకే నేనింకా పడిపోకుండా నిల్చునే ఉన్నాను.

అమ్మ నా జ్ఞాపకాల ప్రపంచంలోకి ప్రవేశించి విహరిస్తోంది.

అమ్మా!

నిన్ను మొదటిసారిగా ఎప్పుడు కలిసానంటావు?

పరిచయమై మాట్లాడి మెలగి అదృశ్యమైన తర్వాత ముఖాన్ని చాటేసే రైలుస్నేహమల్లే ఉన్నాం.... నీకు నేనూ! నాకు నువ్వూ!!

నీకు నేను పరిచయం కావడానికి ముందే నాకు నువ్వు పరిచయమయ్యావు. నీ తొలి దర్శనం నాకు అంతరంగంలోనే చోటు చేసుకుంది. నీ నడకలకు అనుగుణంగా సాగిన ద్రవ ప్రవాహంలో నా దేహాకృతిని తడిపే ఎర్రటి నదిలో ఎంత వెచ్చగా పడుకునే వాడినో నేను.... అప్పుడే నిన్ను నేను అంతరంగ సాక్షిగా చూసేసాను. కానీ అమ్మా! అప్పుడు నా చూపు బొడ్డు తాడిపై ఉండేది.

రోజులూ.. నెలలూ గడిచేకొద్దీ నేను నీలో పెరుగుతూ పెరుగుతూ పది నెలలకు బయటి ప్రపంచానికి వచ్చిన తర్వాతే నువ్వు నన్ను మొదటిసారిగా చూసావు. నేనప్పుడు ఏడుస్తున్నా. దేనికోసమో తెలీని ఏడుపది. కానీ నువ్వు నన్ను చూసి నవ్వుతున్నావు.

నేనలా ఏడుస్తుంటే నువ్వు నవ్వింది అప్పుడేనమ్మా. ఆ తర్వాత నేను ఏడవకుండా ఉండటం కోసం నన్ను నువ్వెలా చూసుకున్నావో నాకు తెలుసు. నా ప్రతి అడుగులోనూ నువ్వు ముందో వెనకో ఏదైనా కావచ్చు, ఉంటూనే ఉన్నావు.

నా జ్ఞాపకల పుస్తకంలోని ప్రతి అక్షరాన్నీ నువ్వు నా చెయ్యి పట్టుకుని రాసిందే కదమ్మా! ఎప్పుడైతే అ ఆ.. లు రాయించావో అప్పటి నుంచి అక్షరాలలోనూ మాటల్లోనూ వాక్యాల్లోనూ నువ్వు ఉంటూనే ఉన్నావమ్మా!

నీ ఒడిలో వెచ్చగా ఉన్న క్షణాలూ, నీ చీరనే ఊయలగా చేసి అందులో పడుకుంటూ ఆస్వాదించిన నీ ఆనందం ఇలా ఒకటేమిటీ..! ఎన్నో.. ఎన్నెన్నో జ్ఞాపకాలు.... నన్ను నడిపిస్తోంది ఇన్నేళ్ళయినా..

అమ్మా! నువ్వు శాశ్వతమైనదానివి! నువ్వు కనిపించని క్షణమంటూ లేదు! ఆకాశం నువ్వే! అందులో విహరించే సూర్యచంద్రులు నువ్వే!



నన్ను వెలుగు వైపుగా నడిపిస్తున్నది నువ్వేనమ్మా! ఎండా వానా ప్రతిదీ నువ్వేనమ్మా! పగలూ రాత్రీ నువ్వేనమ్మా!

నువ్వు లేకుండా నేనెక్కడమ్మా!?

నీ లోంచి ఈ ప్రపంచాన్ని చూడనిచ్చిన నీ కంటిచూపే నాకు మార్గదర్శి. జీవిత పుస్తకంలో చివరి పేజీ వరకూ నీ బంధం వెన్నంటే ఉంటుందమ్మా....

అమ్మా!

నువ్వు నాతో ఎన్ని దాగుడుమూతలు ఆడినాసరే, నా జ్ఞాపకమంతా నువ్వేనమ్మా!

**- యామిజాల జగదీశ్**

# ద్వార ప్రతిష్ట ఎలా ఉండాలి?

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్స్: 9885446501/9885449458



కె.వాస్తు, నంద్యాల

**ప్రశ్న: సింహద్వారాన్ని గోడకు ఏ విధంగా అమర్చాలి? గోడకు లోపలి వైపున అమర్చాలా? మధ్యలో అమర్చాలా? లేక గోడకు వెలుపలి అంచుకు అమర్చాలా?**

**జవాబు:** గృహ సింహ ద్వారం, కిటికీలు, వెంటిలేటర్లు గోడ వెలుపలి అంచుకు సమంగా వచ్చే విధంగా అమర్చాలి. గోడ మందం ఎంత వున్నప్పటికీ గోడ లోపలి అంచుకు సమంగా గానీ, గోడ మధ్య భాగంలోగానీ అమర్చకూడదు. అలాగే గృహం లోపలి ప్రతి గదికి కూడా ద్వారప్రతిష్ట చేసేటప్పుడు ఆయా గదుల గోడలకు వెలుపలి అంచుకు అమర్చేలా జాగ్రత్త పడాలి. "నివాస గృహాల విషయంలో ద్వారాల పైన పేర్కొన్నట్లుగా కాకుండా పారు దప్పియున్నట్లయితే అనేక దుష్ఫలితాలు ఉంటాయి.." అని వాస్తు శాస్త్రంలో చెప్పబడింది. పారు దప్పకుండా సరైన స్థానంలో ద్వార గవాక్ష ప్రతిష్టలు గావింపబడిన గృహాలు అనేక విధాల సత్ఫలితాలనిస్తాయని కూడా పేర్కొన్నారు.



అనేక కష్టనష్టాలు భరించేవారు గృహంలో ఎన్నో మార్పులు, చేర్పులు చేసినప్పటికీ పరిస్థితుల్లో మార్పు రానివారు మమ్మల్ని సంప్రదించారు. వారి ఇంటిని పరిశీలించినప్పుడు ఈ ద్వార ప్రతిష్టలు వాస్తు నియమాలకు విరుద్ధంగా వున్నట్లు కనిపించింది.

ద్వార ప్రతిష్టలను వాస్తు నియమాల కనుగుణంగా మార్చిన తరువాత మంచి ఫలితాలు చాలా శీఘ్రంగా కనిపించాయి. ద్వార ప్రతిష్ట వాస్తు నియమాలకనుగుణంగా వున్నదీ, లేనిదీ, దాని సవరణ ఎవరికి వారే స్వంతంగా నిర్ణయించుకోకూడదు. వాస్తు నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే చేసుకోవాలి. అయితే విహార భవనాలు, ప్రజాభవనాలు, దేవాలయాలు, సర్వజన ఉపయోగాలైన భవనాలు, యజ్ఞ మండపాలు మొదలైన వాటికి మాత్రం గోడ మధ్య భాగంలో ద్వార ప్రతిష్ట చేయాల్సి ఉంటుంది.

## సమస్యలకు పరిష్కారం?

సి.ప్రతాప్, మణికొండ

**ప్రశ్న: మీరు చెప్తున్న సలహాలు చాలా అర్థవంతంగా, సులువుగా అర్థమయ్యే విధంగా ఉంటాయి. ఎలాంటి సమస్యలకైనా చిన్న చిన్న పరిష్కార మార్గాలతో సమాధానం చెప్తారు. నా సమస్య: నా స్థలంలో కొంత భాగం గుడికి ఇచ్చి, కొంత భాగంలో ఇల్లు నిర్మించాను. తరువాత ఆర్థికంగా, బంధువుల్లో, సమాజంలో మర్యాద విషయంలోనూ చాలా నష్టపోయాను. తిరిగి సంపాదించుకోలేనంత నష్టపోయాను. 1) ఈ సమస్య ఎందుకు వచ్చింది? 2) ఏ విధంగా? ప్లాటు వల్లనా? డబ్బుల వల్లనా? పరిష్కార మార్గం తెలపండి. 2) ఈ శీర్షికలో.. శనివారం ఏదైనా ప్రార్థనా మందిరానికి వెళ్లి అక్కడ అడుక్కునే వారికి జేబులో ఉన్నటువంటి మొత్తం చిల్లర వేసి తిరిగి ఇంటికి రావాలి.. అని సమాధానం రాసారు. అలా నేను కూడా చేసినప్పుడు కొంతవరకు అప్పు తీర్చాను. మిగిలిన డబ్బు చెల్లించలేక పోతున్నాను. 3) మంగళవారం రాత్రి 8 గం॥ల తరువాత ఏదైనా గుడి ఆవరణలో కలిసి వున్న రావిచెట్టు, వేపచెట్టుకు తొమ్మిది ప్రదక్షిణలు చేయమన్నారు. దంపతులు ఇద్దరూ చేయాలా? యజమాని మాత్రమే చేయాలా?**

**జవాబు:** స్థలాభావం వల్ల మీ సమస్యను పూర్తిగా రాయటం లేదు. క్లుప్తంగా మీకిచ్చే సలహా.. 1) ఆ స్థలం అమ్మివేయండి. అప్పుడే మీకు విముక్తి కలుగుతుంది. 2) అలా మరికొన్ని శనివారాలు చేస్తూనే ఉండండి. 3) మీరు ఒక్కరైనా సరే, లేదా కుటుంబ సభ్యులతో కలిసిగానీ, స్నేహితులతో కలిసిగానీ ప్రదక్షిణాలు చేయవచ్చు.

## ఎప్పుడూ అనారోగ్య సమస్యలే!

కె.ఆకాశ్, మణికొండ

**ప్రశ్న: ఇల్లు వాస్తు ప్రకారం బాగానే ఉందంటున్నారు. అయినా ఎప్పుడు అనారోగ్య సమస్యలు..?**

**జవాబు:** ఇల్లు వాస్తు ప్రకారం బాగుంటే అనారోగ్య సమస్యలు వుండేవి కాదు. మీ ఇంటికి సంబంధించినంత వరకు– అందరికీ అనారోగ్యం కలిగించే నైరుతి దోషాలు కనిపించటం లేదు. మీ ఇంటి ప్రధాన ద్వారాన్ని ఒకసారి పరిశీలించండి. ఆ ద్వార ప్రతిష్ట సరైన విధంగా జరిగి వుండదు. ద్వారం ఒక పక్కకు తిరిగిగానీ, ఒరిగిగానీ వుండే అవకాశం ఉంది. దాన్ని సరైన ముహూర్తంలో సరిచేయించండి, మంచి ఫలితాలు పొందుతారు. ఒకవేళ ద్వార ప్రతిష్ట సజావుగానే వున్నట్లయితే మీ ఇంటి వాస్తు చూపించి జాగ్రత్త పడటం మంచిది.

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు.
ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే,**
**రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

**వాస్తువార్త**

పూర్తి పేరు : ..........................................
పుట్టిన తేది : ..........................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ................
చిరునామా:..............................................

# ఆరోగ్య సిరి 'నారింజ'

**రోజుకు ఒక ఆపిల్ తినడం వల్ల వైద్యుడికి దూరంగా ఉండొచ్చని వైద్య నిపుణులు ఎప్పుడూ చెబుతుంటారు. ఆపిల్ ఒక్కటే కాదు, ప్రతిరోజూ ఒక నారింజ పండు తినడం చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.**

ఆరెంజ్ తినడం ద్వారా చాలా వరకు ఒత్తిడి లేకుండా ఉంటారని మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొంటు న్నారు. ప్రతిరోజూ ఒక నారింజ పండు తినడం వల్ల ఒక వ్యక్తిలో డిప్రెషన్ 20 శాతం తగ్గుతుందని హార్వర్డ్ మెడికల్ స్కూల్ మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్ పరిశోధకులు తెలిపారు. మైక్రోబయోమ్‌లో పచురితమైన పరిశోధన ప్రకారం ప్రతిరోజూ ఒక నారింజ పండు తింటే, నిరాశ ప్రమాదం తగ్గుతుందని పేర్కొంది.

నారింజ పండును చూడగానే నోట్లో నీరూరుతుంది. జీర్ణ శక్తి బాగుంటుంది. విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. వృక్ష సంబంధ రసాయనాలు (లెమనాయిడ్స్) నారింజలో ఎక్కువగా ఉండటం వలన, పొట్ట, పెద్ద పేగు, ఛాతీ, చర్మం, ఊపిరితిత్తులు, నోటి కేన్సర్లతో పోరాడుతుంది. 24 గంటలు పనిచేసే ఈ లెమనాయిడ్స్ కేన్సర్ కణాలను నిలువరించడంలో తోడ్పడుతుంది!

చూడగానే ఆకర్షించే రంగులతో కనిపించే, ఎంతో రుచిగా తీపి పులుపుల కలయికతో ఉండటమే కాక అనేక పోషక విలువలు కల నారింజ పండును ఇంగ్లీషుతో ఆరెంజ్ అని సంస్కృతంలో నారంగ, ఐరావతి అని, హిందీలో నారంగీ, సంతరా, బంగ్లాలో కమలారేఖ అనే పేర్లతో పిలుస్తారు.

నారింజ పండు, సాధారణంగా తీపి నారింజ అని పిలుస్తారు. ఇది రుటేసి కుటుంబానికి చెందిన ఒక సిట్రస్ పండు, ఇది ఉష్ణమండల,, ఉప ఉష్ణ మండల ప్రాంతాలలో పెరిగే చెట్ల నుండి వస్తుంది. నారింజ కఫం, వాతం, అజీర్ణాలను హరిస్తుంది. శరీరానికి బలం, తేజస్సు కలిగిస్తుంది. మూత్ర విసర్జన ప్రక్రియను సరళతరం చేస్తుంది. కేవలం తీపి నారింజ. ద్వారా ఉబ్బసాన్ని, శ్వాసనాళ వ్యాధులను వైద్యులు తగ్గిస్తూ ఉంటారు.

మలబద్దకం చాలా రోగాలకు దారి తీస్తుంది. నారింజ పండ్లను రసంగా గానీ, పండ రూపంలోగానీ తినడంవల్ల, మలబద్దకాన్ని నివా రిస్తుంది. నారింజ పండులో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి, గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి, చర్మ సౌందర్యాన్ని మెరుగు పరచడానికి, బరువు తగ్గడానికి, కొన్ని రకాల కేన్సర్ ప్రమాదాల్ని తగ్గించడానికి కూడ సహాయ పడుతుంది. రోగ నిరోధక శక్తితో పాటు ఇన్ఫెక్షన్‌తో పోరాడటానికి దోహదపడుతుంది. జీవక్రియలలో కీలక పాత్ర వహించే పొటాషియం, గంధకం, రాగి, మెగ్నీషియం, క్లోరిన్లు నారింజలో లభిస్తాయి! ఏటికేడాది కాసే నారింజ పండులో వేసవి కాలపు పంటలో లవణాలు అధిక మోతాదులో ఉంటాయి. అలాగే తీపి కూడా అధికం. అదే వానాకాలపు పంటలో పులుపుతో పాటుగా రసం ఎక్కువ.



సిట్రస్ పండ్లు ఫేకాలి బాక్టీరియం ప్రస్నిట్జి బ్యాక్టీరియాను పెంచడంలో సహాయపడతాయి. ఇది మానవ పేగులలో కనిపించే ఒక రకమైన మంచి బ్యాక్టీరియా. ఇది న్యూరోట్రాన్స్మిటర్లు సెరోటోనిన్, డోపమైన్‌లను పెంచుతుంది. నారింజ రక్తపోటును నియంత్రించి, కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతుంది. వయస్సు పైబడిన వారికి వచ్చే చర్మ సంబంధిత సమస్యలను, చర్మంపై ఏర్పడే ముడతలను తగ్గిస్తుంది. నారింజ, దీనిలో కేలరీలు తక్కువగా ఉండి, ఫైబర్ అధికంగా ఉంటుంది.

కొన్ని అధ్యయనాల ప్రకారం యాంటీ ఆక్సిడెంటే కాక, ఫైటో కెమికల్స్ కొన్ని ప్రమాదకరీ చేరకుండా నిరోధించే శక్తి నారింజలో బెటా కెరోటిన్ చేస్తుంది. ఇది శరీరంలో కణ జాలాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. దీనితో ఉండే కాల్షియం ఎముకల, దంతాల దృఢత్వానికి ఎంతగానో సహకరిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేయడంలో, రక్తపసరణ సక్రమంగా జరగడంలోనూ దోహదపడుతుంది. ఫలితంగా గుండె పనితీరు మెరుగు పడుతుంది.

పరగడపునే ఒక గ్లాస్ నారింజ రసం తాగితే, మార్నింగ్ సిక్‌నెస్ నుండి సులభంగా బయట పడవచ్చు. ఒక నారింజలో 170 కంటే ఎక్కువ ఫైటోకెమికల్స్, 60 ఫ్లేవనాయిడ్లు ఉంటాయి. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ కేన్సర్, కీళ్లనొప్పులు, మధుమేహం, అల్జీమర్స్ నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది.



మన శరీరానికి సరైన మొత్తంలో ఫైబర్ లభిస్తే, అది కొలెస్టరాల్‌ను తగ్గిస్తుంది. నారింజ గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని దరిచేరకుండా చూస్తుంది.

నారింజ పండు తొక్కలను ఎండబెట్టి పొడి చేసి సున్నిపిండిలో కలిపి చర్మాన్ని శుభ్రపరచుకుంటే, మృత కణాలు పోయి శరీరం కాంతివంతంగా ఉంటుంది. ఎన్నో ఔషధ విలువలు, ఆరోగ్యాన్ని అందించగలిగే నారింజ దగ్గు, ఆయాసం వున్నవారు గ్లాసుడు కమలా రసంలో చిటికెడు ఉప్పు, చెంచా తేనె కలిపి తాగితే శక్తి వస్తుంది. ఎక్కువగా నారింజ తింటే అతిసారం, వాంతులు, వికారం, గుండెల్లో మంట, ఉబ్బరం, తిమ్మిర్లు, నిద్రలేమి వంటి దుష్ప్రభావాలు కలగొచ్చు.

కొన్ని అనారోగ్య సమస్యలున్నవారు, జలుబు ఉన్న వారు నారింజకి దూరంగా ఉంటే మంచిది. నారింజ అతిగా తినకూడదు. ఇది అసిడిటీకి కూడా కారణం కావచ్చు. ఇది సిట్రస్ జాతికి చెందిన ఫలం. దీనిని ఉష్ణ దేశాల్లోనూ, సమశీతోష్ణ ప్రాంతాల పండిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో నంద్యాల, వడ్లమూడి మొదలైన ప్రాంతాలలో బాగా పండిస్తు న్నారు.



నారింజపండ్ల కాలం గడిస్తున్నకొద్దీ ప్రకృతిరీత్యా మార్పులు చెందుతూ వస్తున్నాయి. నిమ్మ, బత్తాయి, నారింజ ఒకే జాతికి చెందిన ఫలాలు, గుణాలు దాదాపు సమానంగానే ఉంటాయి. దీన్ని నిమ్మ కన్నా కాస్త ఉత్తమం అంటారు. పులుపుతో బాటు తీపి అనే అదనపు గుణం కూడా నారింజకి ఉంటుంది.

### రకాలు

నారింజలో రెండు రకాలున్నాయి. పుల్ల, నారింజ, తీపి నారింజ. పుల్ల నారింజలో నీరు అధికంగా ఉంటుంది. లవణాలు తక్కువగా ఉంటాయి. ఇవి వర్షాకాలం కాస్తాయి. తీపివి వేసవి కాలంలో కాస్తాయి, నీటిభాగం తక్కువ, లవణాలు ఎక్కువ. ఇవి దేహానికి మేలు చేస్తాయి. ఇవి తినటం శ్రేయస్కరం. ముదిరిన పుల్ల నారింజపండ్లను కోసి, ఉప్పులో ఊరబెట్టి, కారం, మెంతిపొడి కలుపుకున్నట్లయితే ఊరగాయలా నిల్వ ఉంటుంది. రుచిగా ఉండటమే కాక, ఆరోగ్యం వృద్ధిపరుస్తుంది. అలాగే ఆహారనాళాలలో విషక్రిములు చేరకుండా నిరోధించే శక్తి నారింజలో బెటా కెరోటిన్ చేస్తుంది.

ఇది శరీరంలో కణజాలాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. దీనితో ఉండే కాల్షియం ఎముకల, దంతాల దృఢత్వానికి ఎంతగానో సహకరిస్తుంది. నారింజ పండు తొక్కలతో మన ఇంటిని సైతం శుభ్రం చేసుకోవచ్చు. ఈ తొక్కలను మిక్సీలో వేసి రసం తీయాలి. అందులో కాస్త వెనిగర్ కలిపి ఆ మిశ్రమాన్ని బాటిల్‌లో పోసి స్ప్రే చేస్తుంటే ఎలాంటి మరకలైనా పోతాయి. ముఖ్యంగా కిచెన్ బండపై పడిన మరకలను ఇలా సులభంగా వదలగొట్టవచ్చు. సింక్ మీద ఈ స్ప్రే చేస్తుంటే ఎలాంటి దుర్వాసన రాకుండా ఉంటుంది.

నారింజ పండు తొక్కలను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లలో కాస్త తేనె కలిపి తాగవచ్చు. ఇది రోజూ తాగే టీ లేదా కాఫీకి చక్కని ప్రత్యామ్నాయం అవుతుంది. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. నారింజ పండు తొక్కలను ఎండబెట్టి పొడిగా చేసి కూడా ఉపయోగించవచ్చు. ఇలా ఈ తొక్కలతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

– ఓలేటి శాంతిశ్రీ


## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు.. వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా:**
**నవ్వుల్:.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080**
**sunmagvaartha@gmail.com**

# కొత్త ధోరణులతో ప్రపంచ పర్యాటక రంగం

ఇప్పుడు ప్రపంచంలోని అనేక దేశాలు పర్యాటకరంగంపై జీవనం సాగిస్తున్నాయి. వారి సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పడంతో పాటు పర్యాటకరంగం ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారు. ప్రపంచ పర్యాటక రంగం 2025లో అభివృద్ధి, పునరుద్ధరణ అనే విషయాల్లో కొత్త శకంలోకి అడుగుపెట్టింది. కోవిడ్19 మహమ్మారి తర్వాత కోలుకున్న పర్యాటక రంగం ఇప్పుడు కొత్త ధోరణులు, సాంకేతిక పురోగతులు, సుస్థిర పద్ధతుల ద్వారా రూపాంతరం చెందుతోంది.

## నూతన ధోరణులతో పర్యాటక రంగం

2025లో పర్యాటక రంగం కొత్త ధోరణుల ద్వారా రూపాంతరం చెందుతోంది. **సుస్థిర పర్యాటకం:** ప్రపంచంలో 83 శాతం మంది ప్రయాణికులు సుస్థిర ప్రయాణం ముఖ్యమని భావిస్తున్నారని 2024 సర్వే వెల్లడైంది. ఎకో టూరిజం మార్కెట్ 2026లో 172.4 శాతం బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యతనిస్తుంది. **డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్:** ఆన్‌లైన్ బుకింగ్ ప్లాట్ ఫారం ఏఐ ఆధారిత వ్యక్తిగతీకరణ, స్మార్ట్ హోటల్ రూములు, ప్రయాణ అనుభవాన్ని మెరుగు పరుస్తున్నాయి. 2026లో 75 శాతం ఆదాయం ఆన్‌లైన్ బుకింగ్‌ల ద్వారా వస్తుందని అంచనా.

**వ్యక్తిగతీకరణ:** 65 శాతం మంది ప్రయాణికులు వ్యక్తిగతీకరించిన అనుభవాలకు ప్రాధాన్యత ఇస్తారు. ఇందులో గమ్యస్థానాలు, వసతి, కార్యకలాపాలు ఉన్నాయి. ఈ ధోరణి 2025 నుండి 2035 వరకు 17.8 శాతం సిఎజిఆర్‌తో వృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. సిఎజిఆర్ అంటే సంయోజిత వార్షిక వృద్ధి రేటు. ఒక నిర్దిష్ట కాలంలో (ఉదాహరణకు 5 లేదా 10 సంవత్సరాలు) పర్యాటక రంగంలో ఆదాయం, సందర్శకుల సంఖ్య లేదా పెట్టుబడులు ఎలాంటి స్థిరమైన సగటు వార్షిక వృద్ధి రేటుతో పెరుగుతున్నాయో చూపించే కొలమానం సిఎజిఆర్.

**అడ్వెంచర్ వెల్‌నెస్ టూరిజం:** అడ్వెంచర్ టూరిజం, స్లీప్ టూరిజం వంటి కొత్త రకాల పర్యాటకం పెరుగుతున్నాయి. స్లీప్ టూరిజం మార్కెట్ 2025 నుండి 2030 వరకు 12.4 శాతం సిఎజిఆర్ తో వృద్ధి చెందుతుందని అంచనా. **మెడికల్ టూరిజం:** థాయ్‌లాండ్, మెక్సికో వంటి దేశాలు మెడికల్ టూరిజంలో ముందంజలో ఉన్నాయి, ఇక్కడ 14 మిలియన్ మంది ప్రతి సంవత్సరం వైద్య సేవల కోసం ప్రయాణిస్తున్నారు. 2025లో ప్రపంచ పర్యాటక రంగం గణనీయమైన ఆర్థిక వృద్ధిని సాధిస్తోంది. వరల్డ్ ట్రావెల్ అండ్ టూరిజం కౌన్సిల్ ప్రకారం 2024లో ఈ రంగం ప్రపంచ జీడీపీలో 10 శాతం సహకారం అందించింది. ఇది సుమారు 11.1 ట్రిలియన్ డాలర్లకు సమానం. 2025లో ఈ సంఖ్య 11.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేయబడింది. ఇది 3.9 శాతం వార్షిక వృద్ధి రేటును సూచిస్తుంది. అంతర్జాతీయ పర్యాటక ఆదాయాలు 2024లో 2.0 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 2025లో ఇవి 2.1 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతాయని అంచనా వేయబడింది. ఈ రంగం 2024లో 357 మిలియన్ ఉద్యోగాలను సృష్టించింది. ఇది ప్రపంచంలోని ప్రతి 10 ఉద్యోగాలలో ఒకటిగా ఉంది. 2025లో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. మన దేశంలో ప్రార్థనా స్థలాల సందర్శనలతో కూడా పర్యాటక రంగానికి ఆదాయం వస్తుంది. దీన్ని టెంపుల్ టూరిజం అంటారు. తిరుపతి, షిర్డి సాయి ఇత్యాది ఆలయాలు టెంపుల టూరిజం విభాగంలోకి వస్తాయి. అయితే విపత్తు టూరిజం, సినిమా టూరిజం కూడా ఇంకా అభివృద్ధి పరిస్తే పర్యాటక రంగానికి మరింత ఆదాయం చేకూరుతుంది.

## విపత్తు పర్యాటకం

విపత్తు జరిగిన ప్రదేశాలను చూడటానికి, అక్కడి పరిస్థితులను తెలుసుకోవడానికి వెళ్ళే పర్యాటకాన్ని విపత్తు పర్యాటకం అంటారు. విపత్తు అనేది రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి: ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించిన విపత్తు. రెండవది: మానవ ప్రమేయంతో జరిగిన విపత్తు. భూకంపం, తుఫాను, వరద, అగ్నిప్రమాదం, అగ్నిపర్వతం, అణు పేలుళ్లు, యుద్ధం వంటివి జరిగిన ప్రదేశాలను తిలకించడానికి కొందరు పర్యాటకులు ఆసక్తి చూపిస్తుంటారు. విపత్తి పర్యాటకం పేరు చెప్పగానే జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై జరిగిన అణుబాంబు ప్రయోగం గుర్తుకు వస్తుంది. నేటికీ ఆ ప్రదేశాలను తిలకించడానికి ప్రపంచ పర్యాటకులు హిరోషిమా, నాగసాకి పట్టణాలకు వెళుతున్నారు.

## ప్రముఖ విపత్తు పర్యాటక ప్రదేశాలు

విపత్తు పర్యాటకం అంటే ప్రకృతి వైపరీత్యాలు, చారిత్రక ప్రమాదాలు, విపత్తులు సంభవించిన ప్రాంతాలను సందర్శించడం. ఈ ప్రదేశాలు ఒకవైపు దుర్ఘటనల జ్ఞాపకాలను నిలిపి ఉంచుతాయి. మరోవైపు మనిషి ప్రకృతి సంబంధాలపై అవగాహన కలిగిస్తాయి.



2004లో వచ్చిన సునామీ వల్ల నాగపట్టణం, కడలూరు, కన్యాకుమారి, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలు తీవ్ర నష్టాన్ని చూశాయి. అక్కడి స్మారక స్థూపాలు, తీరప్రాంత అవశేషాలు విపత్తు పర్యాటకులను ఆకర్షిస్తాయి. 1993లో మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాలో జరిగిన భారీ భూకంపంలో వేలాది మంది మరణించారు. ఆ ప్రదేశంలో స్మారకాలు నిర్మించబడ్డాయి. 2001లో గుజరాత్‌లోని భుజ్‌లో జరిగిన భూకంపం అనేక గ్రామాలను నాశనం చేసింది. అక్కడి అవశేషాలు, స్మారక స్థూపాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. 1999లో వచ్చిన సూపర్ సైక్లోన్ వల్ల పది వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అక్కడి తీరప్రాంతాలు, స్మారకాలు విపత్తు పర్యాటక ప్రదేశాలుగా ఉన్నాయి.

కేదార్‌నాథ్ వరదలు (2013) కారణంగా నష్టపోయిన ప్రాంతం. ఇక్కడి విపత్తు అవశేషాలు, స్మారకాలు చూడటానికి సందర్శకులు వస్తుంటారు. జలియన్‌వాలా బాగ్ (అమృత్‌సర్, పంజాబ్)లో 1919 ఏప్రిల్‌లో జనరల్ డయ్యర్ కాల్పులు జరిపిన ఘటనలో వేలాది మంది నిరపరాధులు హతమయ్యారు. ఈ ప్రదేశం నేడు జ్ఞాపక స్థూపం, బుల్లెట్ గోడలు, మ్యూజియం రూపంలో సంరక్షించారు. ఇది భారత స్వాతంత్ర్య పోరాటానికి సాక్ష్యంగా నిలిచిన స్థలం. హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్ర భారతదేశంలో ఒక ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదేశం. దీనిని ధర్మక్షేత్రం, యుద్ధక్షేత్రం అని కూడా పిలుస్తారు. ఇది మహాభారత యుద్ధభూమిగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ గీతను శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించినట్లు విశ్వసిస్తారు.




భోపాల్ గ్యాస్ ప్రమాదం స్మారక స్థలం (భోపాల్, మధ్యప్రదేశ్)లో 1984లో యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుండి లీకైన విష వాయువుల వల్ల అనేకమంది మరణించారు. ఇప్పటికీ అక్కడ మ్యూజియం, స్మారక కేంద్రాలు ఏర్పాటు చేసి ఆ విషాదాన్ని గుర్తుచేస్తున్నారు. 1993 ముంబై సీరియల్ బాంబ్ బ్లాస్ట్స్, 2008 ముంబై తాజ్ హోటల్ టెర్రరిస్ట్ దాడి వంటి ఘటనలు మానవ విపత్తులుగా నిలిచాయి. తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ నేడు పర్యాటకులకు ఓ చారిత్రక, భావోద్వేగ స్థలం, బ్రిటిషు పాలనలో భారత స్వాతంత్ర్య సమరయోధులను అమానుషంగా శిక్షించిన జైలు అండమాన్ నికోబార్ దీవులలో ఉన్న సెల్యులార్ జైలు. ఇది 'కాలాపానిన పేరుతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన జ్ఞాపకాలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ కుర్చి మాస్‌యాకర్ స్థలాలు ఉన్నాయి. 1857లో మొదటి స్వాతంత్ర్య సమరంలో అనేకమంది భారతీయులు, బ్రిటిష్ పౌరులు హతమయ్యారు. ఇవికాక మన దేశంలో పుల్వామాలో జరిగిన ఉగ్రవాద దాడి, పెహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ప్రదేశాలు సైతం విపత్తు పర్యాటకం కోవకు చెందుతాయి.

## సినిమా టూరిజం ప్రదేశాలు

సినిమాలు, టెలివిజన్ సీరియల్స్, వెబ్ సిరీస్‌లో చూపించిన ప్రదేశాలను చూసేందుకు పర్యాటకులు వెళ్లడం సినిమా టూరిజం అని అంటారు. ఒక సినిమా లేదా పాటలో కనిపించిన ప్రదేశం, సెట్, ప్రకృతి అందాలను చూసేందుకు అభిమానులు ప్రత్యేకంగా పర్యటిస్తారు. దీనివల్ల ప్రదేశం పర్యాటక కేంద్రంగా మారుతుంది.

ప్రపంచంలో సినిమా పర్యాటకం అనేది చాలా ప్రాచుర్యం పొందింది. సినిమా చిత్రీకరణ జరిగే ప్రదేశాలను చూసేందుకు పర్యాటకులు వెళ్ళడం దీనిలో భాగం. న్యూజిలాండ్ కార్డ్ ఆఫ్ ది రింగ్స్, హాబిట్, మటమటాలోని హాబిటన్ గ్రామం ప్రపంచ ప్రసిద్ధి. వాకటిపు సరస్సు, టొంగారిరో నేషనల్ పార్క్ వంటి ప్రదేశాలు సినిమాల వల్ల ప్రసిద్ధి చెందాయి. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని హ్యారీపోటర్ సిరీస్, వార్నర్ బ్రదర్స్ స్టూడియో టూర్, లండన్ టవర్ బ్రిడ్జ్, మిలీనియం బ్రిడ్జ్ వంటి ప్రదేశాలు, అమెరికాలోని హాలీవుడ్, లాస్‌ఏంజిల్స్‌లోని హాలీవుడ్ స్టూడియోలు, జపాన్‌లోని మెమొయిర్స్ ఆఫ్ ఏ. గీషా, కియోటో టెంపుల్స్, టోక్యోలోని షింజురూ, శిబుయా ప్రాంతాలు, క్రొయేషియాలోని గేమ్ ఆఫ్ థ్రోన్స్, జోర్డాన్‌లోని ఇండియానా జోన్స్ అండ్ ది లాస్ట్ క్రూసేడ్, పెట్రా రాక్ సిటీ, హవాయిలోని జురాసిక్ పార్క్, ఓహు ద్వీపం, థాయిలాండ్‌లో మాయా బే, క్రొయేషియాలో డుబ్రోవ్నిక్ వంటి ప్రదేశాలు సినిమా పర్యాటకంలో ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రాచుర్యం పొందినవి.

## భారతదేశంలో సినిమా టూరిజం

ముంబై మహానగరం సినిమా పర్యాటకంలో బాలీవుడ్‌కి హబ్, ఇక్కడ ఫిల్మ్ సిటీ, సెట్లు, స్టూడియోలు, సినిమాల చిత్రీకరణ.. మొదలైన అంశాలు సినీ పర్యాటక అభివృద్ధికి దోహదపడుతున్నాయి. లెక్కలేనన్ని భారతీయ సినిమాలు గోవాలో చిత్రీకరించారు. కేరళలోని అలెప్పి, మున్నార్, వయనాడ్ ప్రాంతాలలో చాలా సినిమాలు నిర్మించారు.

భూతల స్వర్గం కాశ్మీర్‌లో నాటి నుండి నేటి వరకు ఎన్నో భాషల చిత్రాలను చిత్రించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లా, కులూ మనాలి ఇత్యాది ప్రదేశాలలోని మంచు కొండలు ప్రకృతి దృశ్య కావ్యాలుగా ప్రశంసలందుకున్నాయి. ఊటీలోని టీ తోటలు, హిల్ స్టేషన్.. ఇలా చెప్పుకుంటూ పోతే భారతదేశంలో అనేక ప్రదేశాలు సినిమా పర్యాటకాభివృద్ధికి దోహదపడుతున్నాయి.

**- షేక్ అబ్దుల్ హకీం జాని**

# 21 సెప్టెంబరు, 2025 నుండి 27 సెప్టెంబరు, 2025 వరకు



## వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం



ఈ వారం శత్రువర్గం పన్నే పన్నాగాలు మీరు ముందుగానే గ్రహించగలుగుతారు. స్నేహితుల ద్వారా రుణంగా తీసుకున్న ధనాన్ని తిరిగి చెల్లించగలుగుతారు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న కొన్ని అంశాలను వెనువెంటనే పరిష్కరించుకుంటారు. చేతికి సుబ్రహ్మణ్య పాశుపత కంకణాన్ని ధరించండి. కుటుంబ పురోగతికి సంబంధించిన విషయాలు వెను వెంటనే నిర్ణయాలు తీసుకుంటారు.

### వృషభం



ఈ వారం కొంతమందితో ఎన్నో రకాల అభిప్రాయ బేధాలు, ఇష్టం లేని పరిస్థితి ఉన్నప్పటికీ పిల్లల భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా కలిసి ఉండాలి, పైకి బాగున్నట్టుగా నటించాలి అని ఉంటుంది. మీకు ఏమాత్రం సంబంధం లేని విషయాలలో మీ పేరుని ప్రస్తావిస్తారు. మెడలో శ్రీ మేధా దక్షిణామూర్తి డాలరు ధరించండి. శత్రువర్గంతో సమస్యలు తలెత్తుతాయి.

### మిథునం



ఈ వారం ప్రతి ఒక్క విషయంలోనూ నిరాశకు గురి చేయడము ఇబ్బందికరమైన మాటలు వినటం పెద్ద సమస్యగా మారుతుంది ఇలా మాట్లాడే వారికి దూరంగా ఉండాలని గట్టి నిర్ణయం తీసుకుంటారు. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయండి. రెన్యువల్స్ కోసం దరఖాస్తులు దాఖలు చేస్తారు. కళ్ళకు చక్రాలు కట్టుకొని మరి పనిచేస్తారు.

### కర్కాటకం



ఈ వారం అనుకున్న కార్యక్రమాలలో పురోగతిని సాధిస్తారు. నూతన వ్యాపారాలు ప్రారంభించాలన్న ఆలోచనలు ముడి పడతాయి.ప్రయత్నం పూర్వకంగా కొన్ని వివాదాలు పరిష్కరించే ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన విద్యల పట్ల ఆసక్తి కనబరుస్తారు. హరిచందనంతో శ్రీ విష్ణు అర్చన చేయించి, ఆ గంధం బొట్టు రోజు ధరించండి. పోటీ పరీక్షలు పాల్గొంటారు.

### సింహం



ఈ వారం శుభకార్యాలకు సంబంధించిన ప్రస్తావనలు ముడి పడతాయి. ముహూర్తాలు ప్రయాణ తేదీలను ఖరారు చేసుకోగలుగుతారు. నూతన స్నేహాలు వెలుగు చూస్తాయి. ప్రేమ వైఫల్యం చెందే అవకాశం ఉంది జాగ్రత్త వహించండి. ధన రూపంలో ఎవరికి ఎప్పుడు ఏ సహాయం చేయొద్దు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి.

### కన్య



ఈ వారం కొన్ని ప్రయత్నాలు కొన్ని కార్యక్రమాలు చేయాలో లేదో అన్న సంకోచం స్థితి ఏర్పడుతుంది.ఊర్లో ఉన్న పెద్దవాళ్ల పరిస్థితులు తారుమారవ్వటం మన ఆస్తికి ఇబ్బందులు ఏర్పడతాయి అన్ని భావిస్తారు. ఇష్టం లేనప్పటికీ కొంతమందితో మాట్లాడటం పరిచయాలు పెంచుకోవడం కొన్ని ప్రయత్నాలు తాత్కాలికంగా చేస్తారు. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయండి.

### తుల



ఈ వారం కొంతమంది వ్యక్తుల ప్రవర్తన మీకు నచ్చక కొన్ని నిర్ణయాలను వెనువెంటనే తీసుకుంటారు. దూరప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి. కాపురంలో చిచ్చు పెట్టే వారిని గుర్తిస్తారు. వీరి పట్ల మీ ప్రవర్తన మారుతుంది. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయండి. లిఖిత పూర్వకమైన పత్రాల పట్ల ఖచ్చితమైన శ్రద్ధ చూపించండి. కీళ్ల నొప్పులు నేత్రవ్యాధులుతో అవస్థ పడే అవకాశం ఉంది.

### వృశ్చికం



ఈ వారం వినోదభరితమైన కార్యక్రమాల పట్ల మక్కువ కనబరుస్తారు. నూతన స్నేహాలు పరిచయాలు ఉపయోగ పడతాయి. దీర్ఘకాలికంగా ముడి పడని అటువంటి కొన్ని అంశాలు ఇప్పుడు మీకు అనుకూలంగా మారతాయి. బంధువులతో స్నేహితులతో కొన్ని కార్యక్రమాల గురించి చర్చిస్తారు. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి త్రిశూల్ పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది.

### ధనస్సు



ఈ వారం వృత్తి, ఉద్యోగ వ్యాపారాల పరంగా సందర్భోచితమైన నిర్ణయాలు తీసుకుని లాభపడతారు. సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. మంచి సమాచారం అందుకుంటారు. శ్రమకు అదృష్టం తోడవుతుంది. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. సంతాన పురోగతి బాగుంటుంది. క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తారు. ఆధ్యాత్మిక ప్రసంగాల పట్ల ఆకర్షితులు అవుతారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

### మకరం



ఈ వారం సన్నిహితులు, మిత్రులను కలిసి సంతోషంగా గడుపుతారు. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు చేస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. ఆరావళి కుంకుమ, శ్రీ లక్ష్మీ చందనంతో అమ్మవారిని పూజ చేయండి, మంచి ఫలితాలు ఉంటాయి. మాటల చాతుర్యంతో అందరినీ ఆకట్టుకుంటారు. సహోదరీ వర్గానికి మీ వంతు సహాయ సహకారాలు అందిస్తారు. భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

### కుంభం



ఈ వారం ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు. కుక్కలకు జీవరాసులకు మంచినీళ్లను పెట్టండి. రహస్య మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడం కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి నరదిష్టి తొలగిపోతుంది. స్నేహితుల ద్వారా నూతన వ్యాపారాలకు పెట్టుబడులను అందిస్తారు. బంధువులతో సమస్యలు ఏర్పడతాయి.


### మీనం




ఈ వారం నూతన వ్యాపారాన్ని ప్రారంభించాలన్న ఆలోచనలు అంతంతమాత్రంగా ఉంటాయి సకాలంలో మీకు రావాల్సిన పర్మిషన్లు లైసెన్సులు ఆలస్యం అవ్వడం వలన కొంతకాలం ఎదురు చూడవలసి వస్తుంది. కుటుంబంలో కొంతమంది ఆరోగ్యం బాలేక వాళ్ళకి మీరు సేవ చేసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. జిల్లేడు వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి ఆటంకాలన్నీ తొలగిపోతాయి.

# ఈ వారం కార్టూన్స్


"మంచి వారికి మంచే జరుగుతుందని" చెబుతున్నారే
కాని...నాకు మంచి జరుగుతుందా లేదా చెప్పండి...!!


1979 జూన్ 2, శనివారం రోజున మీరు నన్నేమన్నారో
గుర్తొచ్చింది. మీకైతే సాయంత్రం ఇంటి రండి!!


దూరాన్నిబట్టి కాదు సార్!
నిమిషానికి ఇరవై రూపాయలు!!



సెయింట్
హెలెనా అనే ఈ దీవి
అట్లాంటిక్ మహాసముద్రంలో
ఉంది. బిజీ జీవితానికి దూరంగా
ప్రశాంతంగా గడపాలనుకునే
వారికి, ప్రకృతి ప్రేమికులకు ఈ
దీవి చక్కటి నెలవు.







